


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162


## విజయ్ కూటమికి కొత్త పేరు.. 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 244 | గురువారం 10 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3




# పాదయాత్రకు ముహూర్తం ఫిక్స్

**మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమైన వైఎస్ జగన్**

- 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో యాత్ర ప్రారంభం
- బాపట్ల జిల్లా పర్చూరు కార్యకర్తల సమావేశంలో ప్రకటన
- 2029 ఎన్నికలే లక్ష్యంగా రెండో విడత యాత్రకు వ్యూహరచన
- 'ప్రజా సంకల్ప యాత్ర' సెంటిమెంట్‌నే మళ్లీ ఫాలో అవుతున్న జగన్

2లో






# నీరు జీవం అయితే భూమి జీవితం

**మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**ద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన** 2లో

**ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన**


**మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్న చంద్రబాబు**

కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం మాచవరంలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరు జీవం అయితే భూమి జీవితం అన్నారు. అందుకే ఈ రెండు కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పుకొచ్చారు.

# ఎన్నారైల అండతోనే గెలిచాం..

## చంద్రబాబు అరెస్ట్ సమయంలో కొండంత బలమిచ్చారు

- ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ఎన్నారైల కృషి మరువలేనిదని కొనియాడిన మంత్రి లోకేశ్
- తెలుగుజాతిని ప్రపంచంలో నెం.1గా నిలిపే బాధ్యతను సమిష్టిగా తీసుకుందామని పిలుపు
- చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిరసనలకు పిలుపు 2లో
- 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయేను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టీకరణ
- రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుని, పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలన్న లోకేశ్



# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్..

- గణేశ్ మంటపాల నిర్వాహకులకు తియ్యని కబురు చెప్పిన మంత్రి నారా లోకేశ్ 2లో
- సోషల్ మీడియా వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- నిర్వాహకులపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- కూటమి సర్కార్ నిర్ణయంపై భక్తులు, ఉత్సవ కమిటీల హర్షం



# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..



- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

2లో

## తన మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడంపై బొత్స స్పందన

**చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన చిన్న శ్రీను రాజకీయాల్లో మనిషి అనేవాడికి స్వార్థం ఉంటుందన్న బొత్స రాజకీయాల్లో పార్టీలు మాత్రమే శాశ్వతమని వ్యాఖ్య** 2లో



వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) వైసీపీకి రాజీనామా చేసి... ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బొత్స సత్యనారాయణ స్పందించారు. విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

- దేశవ్యాప్తంగా రైల్వే మల్టీ ట్రాకింగ్
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో లైన్
- నాలుగు పరిధిలో 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు
- దక్షిణాదిలో 5, ఉత్తరాదిలో 3 ప్రాజెక్టులు
- 7 రైల్వే కారిడార్లలో 4 లేన్ల ట్రాక్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాలకు భారీ ప్రయోజనం
- 4,790 గ్రామాలకు రవాణా సదుపాయాలు
- పెరిగనున్న రైళ్ల రాకపోకల సామర్థ్యం
- రైల్వేపై కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- మీడియాకు వెల్లడించిన అశ్విని వైష్ణవ్



# నిజం గెలిచింది.. నీతి నిలిచింది



**చంద్రబాబు గారి అక్రమ అరెస్టుకు మూడేళ్లు**

**కుట్రపూరితంగా 53 రోజుల నిర్బంధం**

**నాటి చీకటి రోజుకు నిరసనగా 53 కొవ్వొత్తులు వెలిగించిన మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి** 2లో

**నంద్యాలలో భారీ బహిరంగ సభ**





నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 09 ( నంది పత్రిక )

ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నిస్వార్థ సేవకు మారుపేరుగా నిలిచిన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిపై గత పాలకులు బనాయించిన అక్రమ కేసుల కుట్ర వీగిపోయిందని, అంతిమంగా 'నిజం గెలిచి, నీతి నిలిచింది' అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి అన్నారు. చంద్రబాబు నాయుడు గారిని అక్రమంగా అరెస్టు చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, ఆనాడు ఆయనను నిర్బంధించిన నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద బుధవారం భారీ బహిరంగ సభను నిర్వహించి 53 కొవ్వొత్తులు వెలిగించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ సరిగ్గా మూడేళ్ల క్రితం (9 సెప్టెంబర్ 2023) వేళ రాజకీయ దురుద్దేశంతో, కక్షపూరితంగా జగన్ ప్రభుత్వం చంద్రబాబు గారిని నంద్యాలలో అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిందని గుర్తు చేశారు. ఎలాంటి తప్పు చేయని చంద్రబాబు గారు ప్రజల ఆశీస్సులు, న్యాయస్థానాల తీర్పులతో కడిగిన ఆణిముత్యంలా తప్పుడు కేసుల నుంచి బయటకు వచ్చారని అన్నారు. ప్రజాబలమే తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు గారికి శ్రీరామరక్ష అని, నాడు చీకటి రోజును సృష్టించిన వారికి ప్రజలే ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. నాటి అక్రమ అరెస్టు, 53 రోజుల నిర్బంధానికి నిరసనగా 53 కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు.

# నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్నిదెబ్బతీయలేకపోయారు

**మూడేళ్ల క్రితం తన అరెస్టును గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు**



- ప్రజల మద్దతుతో 2024 ఎన్నికల్లో నిజం గెలిచిందన్న టీడీసీ అధినేత
- రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో కార్యక్రమాల నిర్వహణ
- తెలుగు జాతిని నంబర్ 1 చేయడమే తన లక్ష్యమని పునరుద్ఘాటన

2లో

# నీరు జీవం అయితే భూమి జీవితం

ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే... రాష్ట్రంపై తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నది నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలోకి వెళ్లింది.ఆ నీటిని వినియోగించుకోగలిగితే మనందరికీ ఎంతో ప్రయోజనం కలిగేది. రాష్ట్ర సచివాలయానికి మాత్రమే పరిమితం కాకుండా... ప్రజల జీవితాల్లో వెలుగు వచ్చేలా చేయటమే పాలన. అందుకే ప్రతీ నెలలోనూ వీలైనన్ని సార్లు ప్రజల మధ్యకు వచ్చి వారి బాగోగులు తెలుసుకుంటున్నాను. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన పైనే ప్రధానంగా దృష్టి సారించి పాలన అందిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి తేదీనే పేదల సేవలో పేరిట పెన్షన్ అందిస్తూ ప్రజల్ని కలుస్తున్నాను.పీ4తో సామాజిక భాద్యత కింద వారి జీవన ప్రమాణాలు పెంచే ప్రయత్నం చేస్తున్నాం. అభివృద్ధి చేయాలి, సంపద సృష్టించాలి. జీవన ప్రమాణాలు పెంచి అంతా గౌరవంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ హయాంలో మూడేళ్ల క్రితం జరిగిన అరెస్టు ఘటనను గుర్తు చేసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. నాడు జరిగిన ఘటనలను సభలో వివరించిన ముఖ్యమంత్రి జగన్ నైజాన్ని... జగన్ పైమాజీ సీఎం రోశయ్య వ్యాఖ్యలను ప్రస్తావించారు.ఈ అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీ పాలకులు మూడేళ్ల క్రితం నన్ను అన్యాయంగా అరెస్టు చేసిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9 తేదీన నన్ను అన్యాయంగా అరెస్టు చేశారు. ఏ తప్పు లేకుండా అరెస్ట్ చేయడం బాధ కలిగించింది.48 ఏళ్లుగా రాజకీయంలో ఉన్నాను. 31 ఏళ్ల క్రితం తొలిసారి సీఎం అయ్యాను. విలువలతో కూడిన రాజకీయం చేయాలని.. పేద ప్రజలకు, తెలుగు జాతికి న్యాయం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. చాలా మంది నాపై ఆరోపణలు చేశారు. కోర్టులకు వెళ్లారు. నాపై చేసిన ఆరోపణల్ని రుజువు చేయలేక పోయారు... అదే నా నిబద్ధత. రాజకీయంపై కుటుంబం ఆధారపడకూడదనే 36 ఏళ్ల క్రితం ఫ్యామిలీ బిజినెస్ ప్రారంభించాం. అప్పట్లో ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందున కుటుంబ వ్యాపారాన్ని నా సతీమణికి అప్పగించా. నాకు ధన వ్యామోహం లేదు. కేవలం తెలుగు జాతి బాగుండాలనే నేను నిరంతరం ఆలోచన చేస్తా. నంద్యాలలో ఓ సమావేశానికి వెళ్లిన నన్ను అరెస్టు చేస్తామని అర్ధరాత్రి వచ్చారు. నాపై ఆరోపణలు ఏమిటో చెప్పాలని అడిగితే... అరెస్టు చేసిన తర్వాత చెబుతామని అన్నారు. ఓ మాజీ ముఖ్యమంత్రిని ఉన్న పళంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. నా జీవితంలో ఎన్నడూ అనుకోని సంఘటన ఓ దుర్మార్గమైన వ్యక్తి ఆలోచనల వల్ల జరిగింది. నేను జైల్లో ఉన్న సమయంలో నాకేం జరుగుతుందోనని తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చింది. హైదరాబాద్ లో కొందరు అడ్డుపడినా టెకీలు కూడా ముందుకు వచ్చి నిరసనలు తెలిపారు. దేశవిదేశాల్లోని తెలుగు వారంతా కదలి వచ్చారు. పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపేందుకు వస్తుంటే ఆయననూ అడ్డుకున్నారు. ఏమాత్రం వెనక్కు తగ్గకుండా పవన్ కళ్యాణ్ నాకు సంఘీభావం తెలిపారు.గత పాలకులు పెట్టిన కేసులను కోర్టులు కొట్టేశాయి.ఈడీ లాంటి సంస్థలు కూడా ఇందులో ఏమీ లేదని తేల్చింది. గతంలో అచ్చెన్నాయుడు లాంటి నేతల్ని బలవంతంగా అరెస్టు చేశారు. వేధింపులు చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ వెళ్తే ఆయన్ను అక్కడి నుంచి బలవంతంగా వెనక్కు పంపేశారు. ఇలాంటి ఘటనలు చాలా జరిగాయి. నేను ముఖ్యమంత్రి అయ్యాక ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిముషం చాలు. కానీ నేను ఆ పని చేయలేదు. చాలా సౌమ్యంగా ఉంటానని, ఏం చేయలేకపోతున్నారని చాలా మంది అనేవారు. కానీ నాకు సహనం ఎక్కువ. నేను చేసే ఏ పని అయినా అది తెలుగు జాతికి న్యాయం జరగాలన్నదే నా లక్ష్యం. మాజీ సీఎం వైఎస్ఆర్ కు ఆయన కొడుకు విషయంలో జాగ్రత్తలు తీసుకోమని ఆనాడే చెప్పాను. గొడ్డలి పార్టీ అధ్యక్షుడ్ని ఆయన తండ్రి వైఎస్ఆర్ చదువుకోడానికి అమెరికా పంపిస్తే తిరుగుటపాలో వచ్చేశాడు...

ఈ విషయం స్వయంగా వైఎస్సే చెప్పాడు. కొడుకుతో బాధలు భరించలేక అతన్ని వైఎస్సార్ బెంగళూరులోనే ఉంచారని తల్లి విజయమ్మ మాజీ సీఎం రోశయ్యకు చెప్పుకుని బాధపడ్డారు... రోశయ్యే స్వయంగా ఈ విషయం చెప్పారు. ఓ సీఎంగా ఉన్న వ్యక్తి తన కుమారుడిని బెంగుళూరు లాంటి చోట పెట్టాడు అంటే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఎలాంటి వాడో అర్థం చేసుకోండి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తన కొడుకును ఎప్పుడూ ఏపీకి రానీయలేదు బాబాయి వివేకాను గొడ్డలి వేటుతో కిరాతకంగా చంపేశారు. తెల్లవారితే సీఎంగా ఉన్న నాపై నింద వేసి తన పత్రికలో రాయించారు. తన చెల్లి సునీతను కూడా ఏమార్చారు. ఆ రోజే దోషులందరినీ అరెస్టు చేసి ఉంటే ఇప్పుడు పరిస్థితి ఇలా ఉండేదా. ఇప్పుడు తల్లిని, చెల్లినీ కూడా ఆస్తి కోసం మోసం చేస్తున్నారు అలాంటి వ్యక్తులతో రాజకీయం చేయాల్సిన దుస్థితి వచ్చిందని చెప్పుకొచ్చారు.

# ఎన్నారైల అండతోనే గెలిచాం..

2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి (ఎన్నారై) పాత్ర మరువలేనిదని, వారి అండతోనే తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. తెలుగుజాతిని ప్రపంచ యవనికపై నంబర్ వన్ స్థానంలో నిలిపే బాధ్యతను అందరం కలిసికట్టుగా తీసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో కూడా ఎన్డీయే కూటమిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఎన్నారై టీడీపీ సెంట్రల్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యార్యారు. ఈ సందర్భంగా, నూతనంగా ఎన్నికైన సభ్యులతో ఎన్నారై సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్నారై టీడీపీ అధ్యక్షుడిగా డాక్టర్ పి. గురురాజా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ.. “ప్రపంచంలో తెలుగువారు లేని దేశం లేదు. ఏ దేశానికి వెళ్లినా కనీసం 20 మంది తెలుగువాళ్లు మనకు కనిపిస్తారు. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక స్వర్గీయ ఎన్టీఆర్. ఆయన రాజకీయాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చి, చదువుకున్న వారికి, మేధావులకు అవకాశాలు కల్పించారు. ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళు తున్నారు. 2024 ఎన్నికల్లో 50 శాతం స్థానాల్లో యువత గెలుపొందగా, ఏడుగురు ఎన్నారైలకు టీడీపీ అవకాశం కల్పించింది. వారిలో పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి కావడం మనందరికీ గర్వకారణం“ అని వివరించారు.

**కష్టకాలంలో ఎన్నారైలే కొండంత బలం** గత ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. “మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారు. ఆనాడు అమరావతి ఉద్యమానికి ఎన్నారైలు అండగా నిలిచారు. వారిపై అక్రమ కేసులు పెట్టినా భయపడలేదు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు 50 దేశాల్లోని 200 నగరాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించి తమ గళాన్ని వినిపించారు.

ఆ సమయంలో ‘మనకు ఈ రాజకీయాలు అవసరమా‘ అని నా భార్య బ్రహ్మణి నన్ను ప్రశ్నించింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మీరు నిర్వహించిన ‘ఐయామ్ విత్ సీబీఎన్‘ కార్యక్రమం మా కుటుంబానికి కొండంత బలాన్నిచ్చింది. మళ్లీ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పాన్ని బలపరిచింది. ఎంతోమంది ఎన్నారైలు వేల డాలర్లు ఖర్చుపెట్టుకుని ఓటు వేయడానికి రాష్ట్రానికి వచ్చారు. ఉద్యోగాలకు సెలవులు పెట్టి గ్రామాల్లో తిరిగి ప్రజలను చైతన్యపరిచారు. మీ కృషితోనే ఈ రోజు ప్రజా ప్రభుత్వం ఏర్పడింది“ అని లోకేశ్ భావోద్వేగంగా ప్రసంగించారు.

**ఎన్నారైలు.. అత్యంత నమ్మకమైన భారతీయులు**

ఎన్నారైలు అంటే ‘మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్‘ అని అభివర్ణించిన లోకేశ్, వారు మంచి ఉద్యోగాలు చేస్తున్నా నమ్ముకున్న పార్టీ కోసం, తెలుగుజాతి కోసం నిలబడ్డారని ప్రశంసించారు. “విదేశాల్లో ఉంటూ కూడా మీ పిల్లలకు అద్భుతమైన తెలుగు నేర్పిస్తున్నారు. సొంత గ్రామాలపై మమకారం, సేవాభావంతో మీరు చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మీ నిబద్ధతకు హృదయపూర్వక నమస్కారాలు“ అని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా తెలుగువారికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఉత్తరాఖండ్ వరదలు, ఉక్రెయిన్ యుద్ధం, నేపాల్ సంక్షోభం సమయంలో ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి తెలుగువారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చిన ఘనత చంద్రబాబుదని తెలిపారు.

**చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు.. నిరసనకు పిలుపు**

చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయిందని లోకేశ్ గుర్తుచేశారు. “దొంగ కేసు పెట్టి అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. మొదట రూ.3 వేల కోట్ల అవినీతి అన్నారు, తర్వాత రూ.300 కోట్లు, చివరికి రూ.3 కోట్లకు తగ్గించారు. కానీ ఒక్క రూపాయి అవినీతిని కూడా నిరూపించలేకపోయారు. ఐటీ, ఈడీ, కోర్టులు క్లీన్‌చిట్ ఇచ్చాయి. ఆయన ఏ తప్పూ చేయలేదు. ఆయన అభివృద్ధి చేసిన ప్రాంతంలోనే ఆయన్ను జైల్లో నిర్బంధించారు. ఆ 53 రోజులు మనమంతా పోరాడాం. ఆ అక్రమ నిర్బంధానికి గుర్తుగా ఈ రోజు రాత్రి అందరూ తమ ఇళ్లలో 53 కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలపాలి“ అని పిలుపునిచ్చారు.

**పార్టీ బలోపేతానికి, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలి**

ఎన్నారైలు రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారి, తాము పనిచేస్తున్న కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని లోకేశ్ కోరారు. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయని, రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం ఎన్నారై సభ్యత్వాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ ‘మై టీడీపీ యాప్‘ ద్వారా అనుసంధానం కావాలని సూచించారు. “ఏ దేశంలో పది మంది తెలుగువారు ఉన్నా అక్కడ ఎన్నారై టీడీపీ కమిటీ ఉండాలి. రాబోయే 30 రోజుల్లో కమిటీల నియామకాన్ని పూర్తిచేయాలి. కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలి“ అని దిశానిర్దేశం చేశారు.

# 10వేల కోట్లతో రైల్వే కారిడార్లు

రైల్వే వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ మార్గాలతో సహా దేశవ్యాప్తంగా పలు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం, తెలంగాణలోని ఘట్‌కేసర్-కాజీపేట సెక్షన్‌లో నాలుగో లైను నిర్మాణానికి ఆమోదం లభించింది. 110 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టుకు రూ. 2,419 కోట్లు అవుతుందని అంచనా ఉంది. అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ మీదుగా సాగే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 3వ, 4వ లైన్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల పూర్తితో ఆయా మార్గాల్లో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. నాలుగు రాష్ట్రాల్లోని 17 జిల్లాల పరిధిలో నాలుగు లైన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 10,021 కోట్లుగా కేంద్రం పేర్కొంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో ఐదు మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు రాబోతున్నాయి. కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, సరుకు రవాణా, ప్రయాణికుల రైళ్ల వేగం కూడా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిని 2029-30 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక వేసింది. బుల్లెట్ రైలు ప్రారంభోత్సవం 2027లో జరగనుంది. దీని నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయి. వచ్చే ఏడాది మే-జూన్ నాటికి టెస్టింగ్? కోసం రైలు పట్టాలపైకి వస్తుంది. టెస్టింగ్? పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవం జరుగుతుందని అన్నారు. ఇందులో, అరక్కోణం- రేణిగుంట సెక్షన్‌లో 77 కి.మీ.పొడవుతో 3, 4 లేన్ల నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కి.మీ. పొడవుతో నాలుగో లేన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లతో ఆమోదం లభించింది. దీంతో పాటు వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్ల పొడవుతో 3, 4 లైన్ల నిర్మాణం, 159 కిలోమీటర్ల మేర సేలం-కరూర్-దుండిగల్ డబ్లింగ్, 147 కిలోమీటర్ల మేర హోసూర్-ఒమలూరు డబ్లింగ్‌కు ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టుల నిర్మాణంతో రైళ్ల రాకపోకల సామర్థ్యం పెరిగి, రద్దీ తగ్గనున్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా ఉన్న అనేక ప్రముఖ పర్యటక ప్రదేశాలకు రైలు మార్గాలు మెరుగుపడనున్నట్లు తెలిపింది. తారాతరిణి ఆలయం, జగన్నాథ ఆలయం(ఝూర్సుగూడ సమీపంలోని పురాతన ఆలయం), బంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్, అమర్‌కంటక్ ఆలయం, అచానక్‌మార్ టైగర్ రిజర్వ్ వంటి ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ పెరుగుతుందని అంచనా వేసింది. దీంతో పాటు సరుకు రవాణాకు కూడా ఈ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగ పడనున్నాయి. ముఖ్యంగా బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి సరుకుల రవాణా సులభతరం కానుంది. దీనివల్ల ఏడాదికి అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు మార్గం సులభతరం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. సమగ్ర ప్రణాళిక, భాగస్వాముల సంప్రదింపుల ద్వారా బహుళ- రవాణా అనుసంధానాన్ని, లాజిస్టిక్ సామర్థ్యాన్ని పెంపొందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీఎం గతి శక్తి నేషనల్? మాస్టర్ ప్లాన్ ఆధారంగా ఈ ప్రాజెక్టులు ప్రణాళిక రచించారు. ఈ ప్రాజెక్టులు ప్రజలు, వస్తువులు, సేవల రవాణాకు నిరంతరాయ అనుసంధానాన్ని అందిస్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది. రైల్వే నెట్‌వర్క్ పెరగడం వల్ల దేశంలో చమురు దిగుమతులు తగ్గుతాయని అభిప్రాయపడింది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా అవుతుందని తెలిపింది. అలాగే, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని పేర్కొంది.

# పాదయాత్రకు ముహూర్తం ఫిక్స్

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. 2029 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా తాను చేపట్టబోయే రెండో విడత పాదయాత్రకు ముహూర్తం ఖరారు చేశారు. 2027 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని స్పష్టత ఇచ్చారు. నేడు బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశంలో జగన్ ఈ కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారం కోసం జగన్ ఇదే ఫార్ములాను అనుసరించిన విషయం తెలిసిందే. 2017 నవంబర్ 6న కడప జిల్లా ఇడుపులపాయలో ‘ప్రజా సంకల్ప యాత్ర‘ పేరుతో ఆయన తన తొలి పాదయాత్రను ప్రారంభించారు. ఆ యాత్ర 341 రోజుల పాటు ఏకధాటిగా సాగి, 3,648 కిలోమీటర్ల దూరం కొనసాగింది. 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగానే ఆయన ‘నవరత్నాలు‘ పథకాలను ప్రకటించారు. ప్రజల నుంచి వచ్చిన అపూర్వ స్పందన, యాత్రలో తెలుసుకున్న సమస్యల ఆధారంగా రూపొందించిన ఈ హామీలు 2019 ఎన్నికల్లో వైసీపీకి చారిత్రాత్మక విజయాన్ని అందించాయి. మళ్లీ అదే సెంటిమెంట్‌తో 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జగన్ ఈ రెండో పాదయాత్రకు సిద్ధమయ్యారు. 2027లో యాత్ర ప్రారంభించి, ఎన్నికల వరకు దాదాపు రెండేళ్ల పాటు ప్రజల మధ్యే ఉండాలని ఆయన భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జగన్ వ్యూహరచన చేస్తున్నారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, రూట్‌మ్యాప్‌పై స్పష్టత రానుంది. మొత్తం మీద 2029 ఎన్నికల సమరానికి జగన్ ఇప్పటినుంచే ‘పాదయాత్ర 2.ా‘తో సిద్ధమవుతున్న సంకేతాలు పంపారు.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్..

వినాయక చవితి పండుగ సమీపిస్తున్న వేళ, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఉత్సవ నిర్వాహకులకు, భక్తులకు ఒక శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే ప్రతీ గణేశ్ మంటపానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్‘ ద్వారా తన ప్రకటనను వెల్లడించారు. విద్యుత్ ఛార్జీల భారం లేకుండా, ఉత్సవ కమిటీలు, భక్తులు మరింత ఉత్సాహంగా, వైభవంగా వేడుకలు జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. “ఈ వినాయక చవితికి, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అన్ని గణేశ్ మంటపాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని ప్రకటించడం సంతోషంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు జరుపుకుంటున్న వారికి మద్దతుగా, వేడుకలను మరింత వైభవంగా నిర్వహించేందుకు మా ప్రభుత్వం ఈ చొరవ తీసుకుంది“ అని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఇప్పటివరకు ఉత్సవ కమిటీలు గణేశ్ మండపాల కోసం తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలంటే నిర్ణీత రుసుములు చెల్లించాల్సి వచ్చేది. అనుమతుల కోసం కూడా కొంత శ్రమించాల్సి ఉండేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో నిర్వాహకులకు ఈ ఆర్థిక భారం, ప్రక్రియపరమైన ఇబ్బందులు తప్పనున్నాయి. ఈ నిర్ణయం పట్ల ఉత్సవ కమిటీల నిర్వాహకులు, భక్తుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ప్రతీ కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, విజయాలతో వర్ధిల్లాలని నారా లోకేశ్ ఆకాంక్షించారు.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# తన మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడంపై బొత్స స్పందన

“రాజకీయాల్లో మనిషి అనేవాడికి స్వార్థం ఉంటుంది. మనుషులు వస్తుంటారు, పోతుంటారు. కానీ రాజకీయ పార్టీలు మాత్రమే శాశ్వతం. వైసీపీకి ఇది కొత్తేమీ కాదు. పార్టీ తన పని తాను చేసుకుంటూ ముందుకు పోతుంది“ అని అన్నారు. కుటుంబ సభ్యుల నిర్ణయాలకు, తమ రాజకీయ ప్రయాణానికి ఎలాంటి సంబంధం లేదని బొత్స స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ముఖ్య నేతగా, జెడ్పీ ఛైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను రాజీనామాతో విజయనగరం, విశాఖ జిల్లాల వైసీపీలో ఒక్కసారిగా రాజకీయ అలజడి రేగింది.

# నిజం గెలిచింది... నీతి నిలిచింది

ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజా సేవకే అంకితమైన చంద్రబాబు నాయుడు గారికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది తెలుగు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ఆయన తెలిపారు . రాష్ట్రవ్యాప్తంగా ‘నిజం గెలిచింది’ నినాదంతో ప్రజలు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి సీఎం చంద్రబాబు గారికి సంఘీభావం ప్రకటించారని అన్నారు . ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ బాబాన్ , చాబోలు ఇలియాస్ , మునియార్ ఖలీల్ , జిల్లెల్ల శ్రీరాములు, జైనాబి, మిద్దె ఉసేని , ఉప్పరి సురేష్, చలం బాబు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు

“ప్రజల కోసం నిలబడితే ప్రజలు మన వెంట నిలబడతారు, నిజం కోసం నిలబడితే నిజమే మనల్ని నిలబెడుతుంది. ఇదే నా నమ్మకం“ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు అన్నారు. మూడేళ్ల క్రితం స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తనను అరెస్టు చేసిన ఘటనను గుర్తు చేసుకుంటూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆనాటి పరిణామం తనలో విశ్వాసాన్ని మరింత పెంచిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ తప్పు చేయని తనను కుట్రపూరితంగా అరెస్టు చేసి, 53 రోజుల పాటు జైల్లో నిర్బంధించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. “నన్ను జైల్లో పెట్టగలిగారు కానీ, నా స్థైర్యాన్ని దెబ్బతీయలేకపోయారు. వారి రాక్షస చర్యకు నేను కుంగిపోలేదు, లొంగిపోలేదు. దీనికి కారణం నాకు లభించిన ప్రజా మద్దతు“ అని ఆయన తెలిపారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కోసం నిలబడిన తెలుగు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు చూపిన సంఘీభావం తన జీవితంలో మరువలేనిదని అన్నారు. తనను నిర్బంధించినా,

దేశ విదేశాల్లో తన కోసం ప్రజలు ఎత్తిన గొంతును నొక్కలేకపోయారని చంద్రబాబు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా తమ మద్దతును మరింత బలంగా చాటారని చంద్రబాబు అన్నారు. కక్షసాధింపు రాజకీయాలను ఓడించి, నిజాన్ని గెలిపించి రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను తనకు అప్పగించారని తెలిపారు. ఆనాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ‘నిజం గెలిచింది‘ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం, ప్రజల కోసం మరింత కష్టపడాలనే సంకల్పాన్ని బలపరిచిందని వివరించారు.

ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలందరి సహకారంతో తెలుగు జాతిని నంబర్ 1 చేయాలనే తన కలను నిజం చేసి తీరుతానని చంద్రబాబు మాట ఇచ్చారు.

## పార్కుల్లో మౌళిక వసతులు మెరుగుపరచాలి: కమిషనర్ జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక**నగరపాలక సంస్థ పరిధిలోని పార్కులను శుభ్రంగా ఉంచి, మౌళిక వసతులు కల్పించాలని కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. నగరంలోని వైకుంఠపురం పార్క్, రాజన్న పార్క్, పద్మావతి పార్కులను నగరపాలక సంస్థ కమిషనర్ బుధవారం పరిశీలించారు. వైకుంఠపురం పార్కులో తాగునీటి సౌకర్యం కల్పించాలని, పార్కును పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బాత్రూంలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. రాజన్న పార్కులో లైటింగ్ స్తంభాలకు వైర్లు వేలాడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే సరిచేయాలని, పిల్లలు ఆడుకునే పరికరాలు పాడై ఉంటే మరమ్మతులు చేయాలని సూచించారు. కలుపు మొక్కలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం పద్మావతి పార్కులో ఓ చిన్నారిని సరదాగా పలకరించిన కమిషనర్.. "నువ్వే కమిషనర్ అయితే ఈ పార్కులో ఏమేమి చేస్తావు?" అని అడిగారు. అందుకు చిన్నారి పిల్లలు ఆడుకునే ఆట వస్తువులు ఏర్పాటు చేస్తానని చెప్పడంతో కమిషనర్ చిరునవ్వుతో స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆరణి సంధ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డీఈలు మహేష్, మధు, వెంకట ప్రసాద్, శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం దారుణం

### వార్తలను ఖండించాలి కానీ.. కేసులతో గొంతు నొక్కొద్దు : ఏపీజేపిఎస్



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ : 09** నంద్యాల జిల్లాలో జర్న లిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం, అర్ధరాత్రి సమయంలో అరెస్టులు చేయడం వంటి చర్యలను ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి (ఏపీజేపిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు శివరామయ్య ఆచారి, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు తీవ్రంగా ఖండించారు.మంత్రి కి సంబంధించిన అక్రమాలపై వార్తలు రాశారనే కారణంతో జర్నలిస్టులను అర్ధరాత్రి సమయంలో అక్రమంగా అరెస్టు చేశారన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, ప్రజాప్రతినిధుల వ్యవహారాలపై వార్తలు రాయడం జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యతలో భాగమని తెలిపారు.వార్తల్లో వాస్తవాలు లేవని భావిస్తే సంబంధిత మంత్రులు, ప్రజాప్రతి నిధులు వాటిని ఖండిస్తూ వివరణ ఇవ్వాల్సి ఉంటుందని, అంతేకానీ జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని అన్నారు.ప్రశ్నించే గొంతును కేసులతో అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, జర్నలిస్టులపై ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమ కేసులను సహించేది లేదని ఏపీజేపిఎస్ నాయకులు స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ప్రభుత్వం, పోలీసులు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.జర్నలిస్టులపై నమోదైన కేసులను వెంటనే సమీక్షించి, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, భవిష్యత్తులో మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాత్రికేయులు పాల్గొన్నారు.

## బీసీ గురుకులానికి కొత్తగొల్ల క్రిష్ణ ఎల్ఈడి లైట్స్ అందజేత

### అభినందించిన ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి

**పఠాన్ చెరు, చిన్న కంజర్ల, సెప్టెంబర్ 09** పఠాన్ చెరు మండలంలోని చిన్న కంజర్ల గ్రామంలోగల బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల,కళాశాలకు పెద్ద కంజర్ల గ్రామానికి చెందిన కొత్త గొల్ల క్రిష్ణ, గురుకుల పాఠశాల, అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా పాఠశాలకు ఎల్ ఈడిలైట్లను ప్రిన్సిపాల్ బోళ్ల స్రవంతి ఆధ్వర్యంలో లైట్లను అందజేశారు.ఈ సందర్భంగా వారికి ఆర్సిఓ రాజేశం, మరియు పాఠశాల సిబ్బంది. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ అనిల్ కుమార్,డిప్యూటీ వార్డెన్ రాజస్వామి, ఉపాధ్యాయులు ఏసురత్నం, దేవులపల్లి రమేశ్,పాఠశాల సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలి

### - మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం



**కొత్తపల్లి - నంది పత్రిక:** రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం సూచించారు. బుధవారం మండలంలోని ఎదురు పాడు. గ్రామంలో పొలంబడి కార్యక్రమం లో భాగంగా చార్టుల ద్వారా పొలాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిత్ర పురుగులు. శత్రు పురుగుల ఉధృతి గురించి తెలియజేశారు. పురుగు మందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు. రైతులు ముందు అడుగులు వేయాలన్నారు. సూపర్ ఎల్నినో కారణంగా రైతులు వరి పంటను సాగు చేయకుండా ఆరుతడి పంటలు, పీఎండీఎస్ కిట్స్ ని వేసుకోవాలని చెప్పారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రతి రైతుకి ఐడి చేయించుకోవాలన్నారు. సీఎస్సీ సెంటర్ ద్వారా కూడా రైతులు ఐడి క్రియేట్ చేసుకోవచ్చునన్నారు. రైతులు సొంతగా ఏపీఎస్ఆర్ లింక్ ద్వారా ఐడి క్రియేట్ చేసుకోవచ్చునన్నారు. పంట నమోదుని పంట వేసిన ప్రతి రైతు చేయించుకోవాలి అని చెప్పారు. పంట నమోదు పూర్తి అయిన రైతులు వేలిముద్ర ద్వారా ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ, రైతుసేవ సిబ్బంది విజయ్, రైతులు పాల్గొన్నారు.

## పిల్లలకు పోషకాహారంతోనే ఆరోగ్యం

### - ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ



**కొత్తపల్లి - నంది పత్రిక :** పిల్లలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు బుధవారం మండలం కేంద్రమైన లో ఉన్న ఎంపీపీ పాఠశాల నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు గ్రామాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాలలో ఇస్తున్న పోషకాహారం తీసుకోవాలన్నారు. ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రాలలో మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు ఈ కార్య క్రమం నిర్వహిస్తామన్నారు పిల్లల ఆహారంలో పోషకాలు ఉండేటట్లు చూడాలన్నారు. గ్రామా ల్లో ఉన్న అంగన్వాడీలో కేంద్రాలలో వేడి వేడిగా వండిన భోజనం అందించాలన్నారు. సమాజ భాగస్వామ్యం, పోషణం ప్రాథమిక విద్య, బాలల వికాసం, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, మాతృత్వ సంరక్షణ అనే అంశాలను వివరించడం జరిగింది అన్నారు. పోషకా హారం తీసుకోవడం వల్ల తల్లులతోపాటు పుట్టబోయే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటార న్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మరియమ్మ, రవణమ్మ, శేషమ్మ, విజయమ్మ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏఎన్ఎం, ఆశ వర్కర్లు మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.

## పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి సిపిఐ

### ధరల భారంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం




**ప్యాపిలి . సెప్టెంబర్ 09 . (నంది పత్రిక ):**పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే నియంత్రించాలని సిపిఐ మండల కార్యదర్శి మహేష్ డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, పప్పులు, వంటనూనె, బియ్యం, పాలు తదితర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందనంత స్థాయికి చేరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు.ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వ్యాపారుల అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక ధరలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ధరల భారాన్ని మోపుతూ కార్పొరేట్, దళారీ వ్యవస్థలకు ప్రభుత్వం అండగా నిలవడం సరికాదన్నారు.నిత్యావసర వస్తువులపై జీఎస్టీ భారాన్ని తగ్గించాలని, ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పేదలకు సబ్సిడీపై నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే ధరలు తగ్గించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పట్టణ కార్యదర్శి వెంకటేష్, మనోహర్, రమేష్, రాము, వెంకటేష్, హమాలి సంఘం నాయకులు శ్రీనివాసులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేయాలి

### - స్వర్ణ గ్రామాల డిప్యూటీ ఎంపీడీవో కే.పీ.ఆర్ శర్మ

**కొత్తపల్లి - నంది పత్రిక :** ఎన్టీఆర్ భరోసా సామాజిక నూతన పింఛన్ల దరఖాస్తులను స్వీకరించి తప్పకుండా వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని స్వర్ణ గ్రామాల డిప్యూటీ ఎంపీడీవో కే.పీ.ఆర్ శర్మ సూచించారు. బుధవారం మండలంలోని దుద్యాల-1 స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని సందర్శించారు. పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల అర్జీలను స్వీకరించిన సిబ్బంది రిజిస్ట్రేషన్ చేయుచున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింఛన్ల రిజిస్ట్రేషన్కు సంబంధించి ఏమైనా సాంకేతిక సమస్యలుంటే, విద్యుత్ అంతరాయం ఏర్పడితే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తులను కార్యాలయంలో నిర్ణీత గడువులోగా పూర్తి చేయలన్నారు అలాగే వాట్సాప్ మనమిత్ర ట్రైనింగ్, ఆధార్ కేవైసీ, ఆధార్ కార్డు లేని పిల్లల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఏవరైనా ప్రభుత్వ సేవలపై అసంతృప్తిగా ఉంటే ఫిర్యాదు పట్టికలో వారి వివరాలను నమోదు చేయాలన్నారు.



## షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలు



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 9:** తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతిని ఖాజీపేట బస్టాండులో సూక్ష్మ నిర్మాణాల కళాకారుడు, కవి షేక్ హాజీ గౌస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ తన రచనల ద్వారా సామాజిక అన్యాయం, రాజకీయ అవినీతి, ప్రజా సమస్యలను ప్రశ్నించారని, ఆయన కవిత్వం ప్రజల గొంతుకగా నిలిచిందని తెలిపారు. ఆయన ప్రసిద్ధ రచన నా గొడవ ద్వారా సమాజంలోని అన్యాయాలపై తన ఆలోచనలను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో షేక్ హాజీ గౌస్కు శ్రీ కాళోజీ నారాయణరావు జాతీయ పురస్కారం లభించడంపై పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయిత ఇంతియాజుద్దీన్, ఓబుల్ రెడ్డి, కే. జోసఫ్, ఈ. మొహమ్మద్ హుస్సేన్, మహబూబ్ బాషా, రమణ, బొమ్మలయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిజం గెలవాలి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన ఎన్ఎమ్డి ఫిరోజ్



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 09 . (నంది పత్రిక ):**తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ని అసత్య కేసులో చట్టవిరుద్ధంగా నిర్బంధించి నేటికి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా "నిజం గెలవాలి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎమ్డి ఫిరోజ్ తెలిపారు.చంద్రబాబు నాయుడు అరెస్టు అనంతరం రాష్ట్ర ప్రజలతో పాటు దేశ, విదేశాల్లోని తెలుగు వారందరూ ఆయనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. దేవుని సంకల్పం, ప్రజల ఆశీస్సులతో ఆయన నిర్దోషిగా నిరూపించబడ్డారని, చివరికి నిజమే గెలిచిందని పేర్కొన్నారు.ఆ చీకటి రోజును గుర్తుచేసుకుంటూ నంద్యాలలో బుధవారం సాయంత్రం 5:00 గంటలకు అర్కే ఫంక్షన్ హాల్ ఆవరణలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమ సభ ఏర్పాట్లను తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎమ్డి ఫిరోజ్ , ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి పరిశీలించారు.ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్, మండల, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్ఎమ్డి ఫిరోజ్ కోరారు.

## ఖాజీపేట పీహెచ్సీలో గర్భిణీలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 09**ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. ముబీన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (గ్రామీహీూ) కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీలకు ఉచిత రక్త, మూత్ర పరీక్షలు, బీపీ, బరువు పరీక్షలు, అవసరాన్ని బట్టి అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించారు. ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించడంతో పాటు పోషకాహారంపై వైద్య సలహాలు ఇచ్చారు. అధిక ముప్పు ఉన్న గర్భధారణలను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి. నాగభూషణం, హెల్త్ అసిస్టెంట్ బి. సంతమ్మ సుగుణ, స్టాఫ్ నర్స్ సుప్రజ, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గాప్రసాద్, ఫార్మసీ ఆఫీసర్ కేశవయ్య పాల్గొన్నారు.

## మంగళగిరిలో ఘనంగా టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు వేడుకలు




**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 09** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కేక్ తినిపించి శ్రీనివాస రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సవిత, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, ఎమ్మెల్యేలు వరదరాజుల రెడ్డి, కృష్ణ చైతన్య రెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తదితరులు పాల్గొని శ్రీనివాస రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రజలకు సత్వర, పారదర్శక రెవెన్యూ సేవలు అందించాలి

## ప్రభుత్వ భూముల పరిరక్షణకు సమగ్ర డేటా సిద్ధం చేయాలి

## భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

## రెవెన్యూ అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్

**నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 09(నంది పత్రిక):-** ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత సత్వరంగా, పారదర్శకంగా అందించడంతో పాటు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో కలిసి జిల్లా రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఏ నిషేధిత భూముల జాబితా, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, రీ-సర్వే, రెవెన్యూ-1 సేవలు, హౌసింగ్ ఫర్ ఆల్, భూసేకరణ, పిజిఆర్ఎస్, ఐవిఆర్ఎస్, ఓఆర్‌సిఎంఎస్ తదితర అంశాలపై పురోగతిని సమీక్షించారు.

**ఇళ్ల స్థలాల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి** జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మొత్తం 17,574 దరఖాస్తులు అందగా, జాయింట్ కలెక్టర్ లాగిన్ ప్రకారం 5,355 దరఖాస్తులు అర్హత పొందగా, 7,627 అనర్హత పొందాయని... మరో 4,592 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో 327 గ్రామాల్లో 589 లేఅవుట్లను ఏర్పాటు చేసి మొత్తం 81,588 ప్లాట్లను 4,830.365 ఎకరాల్లో అభివృద్ధి చేయగా ఇందులో 4,548 ఎకరాల ప్రభుత్వ భూమిని వినియోగించగా, 282.30 ఎకరాల ప్రైవేట్ భూమిని సేకరించేందుకు రూ.37.60 కోట్లు ఖర్చు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కొత్త మార్గదర్శకాల మేరకు ఇళ్ల స్థలాల కేటాయింపు జనవరి 2025 ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాత విధానంలో కేటాయించిన 1.5 సెంట్లు, 1 సెంటు స్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉంటే వాటినే కొనసాగించాలని, కొత్త విధానం ప్రకారం ఎక్కువ స్థలం కోరుకునే లబ్ధిదారుల కోసం ఖాళీగా ఉన్న ప్లాట్లలో పక్కపక్కనే ఉన్న రెండు ప్లాట్లను గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.




**ప్రభుత్వ భూముల పూర్తి వివరాలు సిద్ధంగా ఉండాలి**

ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూముల పూర్తి వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు, అసైన్‌మెంట్ భూములు, వాగులు, వంకలు, కొండలు, అబ్జెక్షనబుల్, అన్‌అబ్జెక్షనబుల్ పోరంబోకు భూములతో పాటు ఖాళీగా ఉన్న భూములు, ఆక్రమణలు, కోర్టు వివాదాల్లో ఉన్న భూముల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. యానిమల్ కాంప్లెక్స్, వెల్‌నెస్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు తదితర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు అవసరమైన భూములను ముందుగానే గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ఏర్పాటుకు అవసరమైన 5 నుంచి 7 ఎకరాల భూమిని గుర్తించి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజుల్లో ప్రతిపాదనలు పంపాలని పాణ్యం తాసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన భూముల సమాచారాన్ని ఎన్ ఐ సి పోర్టల్‌లో అందుబాటులో ఉంచడం ద్వారా పరిశ్రమలు, వివిధ ప్రాజెక్టుల స్థాపనకు అనువైన భూముల వివరాలు పారిశ్రామికవేత్తలు, సంస్థలకు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**భూ సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనం పెంచాలి - జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్** జిల్లాలో ప్రతి వారం పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీలలో 10 నుంచి 20 వరకు డాటెడ్ ల్యాండ్స్, 22ఏ భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటున్నాయని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్లు, ఆర్డీఓలు మరింత జవాబుదారీతనంతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలోనే సమస్యలను పూర్తిగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఆరు నెలలకు మించి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను గుర్తించి, అవసరమైన స్థాయిలో క్లియరెన్స్ పొందాలని ఆదేశించారు. అన్ని మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల ఫైళ్ల పురోగతిని సమీక్షించి, ప్రజల సమస్యలు అనవసరంగా జాప్యం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. డాటెడ్ ల్యాండ్స్‌కు సంబంధించిన సమస్యలను నిబంధనల మేరకు పరిశీలించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. గ్రామం, సర్వే నంబర్ ఆధారంగా భూమి సరిహద్దులు, స్వభావం, ఆక్రమణలు, నీటి వనరులు తదితర అంశాలను ముందుగానే పరిశీలించేందుకు అందుబాటులో ఉన్న డిజిటల్ వనరులను అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. భూమికి సంబంధించిన ఎన్ ఏ డి , అలినేషన్ , ఇతర ప్రతిపాదనలు వచ్చినప్పుడు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లే ముందే సంబంధిత భూమి పరిస్థితిని పరిశీలించడం ద్వారా సమయం ఆదా అవుతుందని తెలిపారు.

**'గుడ్ ప్రాక్టీసెస్'గా ఉత్తమ పరిష్కార విధానాల నమోదు**

తహసీల్దార్లు, మండల సర్వేయర్లు తమ స్థాయిలో పరిష్కారం కాని కనీసం మూడు ప్రధాన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలతో నివేదిక సమర్పించాలని జేసీ ఆదేశించారు. రెవెన్యూ శాఖలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించిన ఉత్తమ విధానాలను 'గుడ్ ప్రాక్టీసెస్'గా నమోదు చేసి ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాలని సూచించారు. ప్రజలు ఒకే సమస్యపై పదేపదే పిజిఆర్ఎస్‌కు వచ్చే పరిస్థితి లేకుండా మండల, డివిజన్ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డిఆర్ఓ రామునాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియాంక, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరామ్, ఆర్డీఓలు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అరటి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

## ధరలు భారీగా పడిపోయి తీవ్రంగా నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలి:

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయ జ్యోతి




**కడప, సెప్టెంబర్ 9, 2026:** అరటి పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైఎస్ఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి డిమాండ్ చేశారు.బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, పులివెందుల ప్రాంతంతో పాటు వైఎస్ఆర్ జిల్లాలో పండించే అరటికి దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉందని తెలిపారు. అయితే ప్రస్తుతం ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్, పంజాబ్, లక్నో, గోరఖ్‌పూర్ తదితర ప్రాంతాలకు అరటి ఎగుమతులు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం బెంగళూరు, మైసూరు, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్ తదితర మార్కెట్లకు మాత్రమే అరటిని తరలించి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో రవాణా ఖర్చులు పెరగడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు.వైఎస్ఆర్ జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో అరటి సాగు జరుగుతోందని, మొదటి విడత అరటి సాగుకు ఎకరాకు సుమారు రూ.1 లక్ష, రెండో విడత సాగుకు సుమారు రూ.70 వేల వరకు పెట్టుబడి ఖర్చు అవుతోందని విజయ జ్యోతి వివరించారు.అయితే అరటి ధరలు క్రమంగా భారీగా పడిపోతున్నాయని, జూన్ నెలలో టన్నుకు రూ.27,800 ఉన్న ధర జూలైలో రూ.25,000కు, ఆగస్టులో కేవలం రూ. 16,000కు పడిపోయిందని ఆమె తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.అరటి రైతుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి, మార్కెట్ పరిస్థితులను సమీక్షించి, రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు గిట్టుబాటు ధర కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్లు విజయ జ్యోతి పేర్కొన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధర లభించేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేసి, ఇతర రాష్ట్రాలకు అరటి ఎగుమతులు పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# చుంచులూరు ఉన్నత పాఠశాలకు క్రీడా పరికరాల వితరణ



**మద్రిపాడు సెప్టెంబర్ 09నంది పత్రిక :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షిస్తూ చుంచులూరు ఉన్నత పాఠశాలకు రూ.10 వేల విలువైన క్రీడా పరికరాలను దాత నాగరాజుపల్లి రాజా అందజేశారు.గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి విక్రాంత్ తండ్రి నాగరాజుపల్లి రాజా విద్యార్థుల అభివృద్ధి పట్ల తనకున్న శ్రద్ధను చాటుకున్నారు.విద్యార్థులు విద్యలోనే కాకుండా క్రీడలు,ఇతర సహపాఠ్య కార్యకలాపాల్లోనూ ప్రతిభను చాటుకోవాలని,వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ క్రీడా పరికరాలను అందజేసినట్లు దాత నాగరాజుపల్లి రాజా తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక,మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు అవసరమైన క్రీడా పరికరాలను పాఠశాలకు అందించడం అభినందనీయమని అన్నారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని క్రీడా పరికరాలను అందించిన నాగరాజుపల్లి రాజాకు ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి సిపిఐ

## ధరల భారంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం




**బేతంచెర్ల సెప్టెంబర్ 9 ( నందిపత్రిక ).** పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, దస్తగిరి ఎఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఉదయ్ కుమార్ లు డిమాండ్ చేస్తూ, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో స్థానిక బేతంచర్ల పట్టణంలోని పాత బస్టాండులో ఆందోళన కార్యక్రమం నిర్వహించి.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,నిత్యావసర వస్తువుల ధరలు రోజు రోజుకూ పెరుగు తుండటంతో పేద,మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూరగాయలు, పప్పులు, వంటనూనె, బియ్యం, పాలు తదితర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందనంత స్థాయికి చేరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వ్యాపారుల అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక ధరలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలపై ధరల భారాన్ని మోపుతూ కార్పొరేట్, దళారీ వ్యవస్థలకు ప్రభుత్వం అండగా నిలవడం సరికాదన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ భారాన్ని తగ్గించాలని, ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పేదలకు సబ్సిడీపై నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే ధరలు తగ్గించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులుశ్రీరాములు,సోమన్న,మధు,ప్రదీప్,గౌరీ ఉదయ్,బాలు,ఖదీర్,పెద్ద గోపి,రాముడు,మహబూబ్, ఎల్లకృష్ణ ,గోపి. పాల్గొన్నారు.

# ఘనంగా 9వ జాతీయ పోషణ మాసం2026 ప్రారంభం

## "మన అంగన్‌వాడీ మన బాధ్యత"

## పోషకాహారంతోనే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యం: జయలక్ష్మి



**వెలుగోడు, సెప్టెంబర్ 9 (నంది పత్రిక):** పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహారంపై అవగాహన పెంచడంతో పాటు జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు వెలుగోడులో 9వ జాతీయ ఆరోగ్యకరమైన పోషణ మాసం2026 కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అబ్బిరాజు కుంట అంగన్ వాడీ నందు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో " మన అంగన్‌వాడీ మన బాధ్యత " అనే నినాదంతో పోషణ మాసం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జయలక్ష్మి మాట్లాడుతూ సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు పోషణ, ఆరోగ్యం, బాలల అభివృద్ధిపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోషకాహారలో చిన్నారులను నివారించి, వారి శారీరక, మానసిక వికాసానికి బలమైన పునాది వేయడమే పోషణ మాసం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైవిధ్యభరితమైన, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు కలిగిన ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. పిల్లల ఎదుగుదలలో తొలి దశలో అందే పోషకాహారం ఎంతో కీలకమని వివరించారు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహార సేవను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో వేడిగా వండిన పౌష్టికాహారం అందించడం ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు

**ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం** పోషణ, కేవలం ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజలు కలిసి పనిచేసినప్పుడే పోషకాహార లోపాన్ని సరిగ్గా నివారించగలమని జయలక్ష్మి అన్నారు.అలాగే ప్రధానమంత్రి మాతృ వందన యోజన వంటి ప్రభుత్వ పథకాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆర్థిక, ఆరోగ్య సహాయంపై కూడా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతున్నారు."పోషణతో ఆరోగ్యం ఆరోగ్యంతో అభివృద్ధి" సాధ్యమవుతుందని తెలియజేసేందుకు, పోషణ మాసం సందర్భంగా నిర్వహించే అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అనీతాబాయి మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టు అక్రమం, అన్యాయం...

## మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా తీవ్ర ఆగ్రహం



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 9 ( నంది పత్రిక )** ఐ టీవీ న్యూస్ జర్నలిస్టులు నాగచంద్రుడు, సురేష్‌లను అర్ధరాత్రి వేళ అక్రమంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా తీవ్రంగా ఖండించారు. బాధిత జర్నలిస్టుల కుటుంబాలను పరామర్శించి, వైఎస్సార్‌సీపీ తరఫున పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నేతల అప్రజాస్వామిక చర్యలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు: రాజకీయ ఒత్తిళ్లతో అర్ధరాత్రి దాడులు... ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన జర్నలిస్ట్ లపై రాజకీయ నాయకుల ఒత్తిడితో పోలీసులు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇళ్ల తలుపులు బద్దలు కొట్టే విధంగా భయాందోళనలు సృష్టించి అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అరెస్టు చేయడానికి జర్నలిస్టులేమైనా ఉగ్రవాదులా?, దేశద్రోహులా? అని ప్రశ్నించారు. మంత్రి ఫరూక్ తనయులపై ఐ టీవీలో వచ్చిన 'లోగుట్టు' కథనంలో ఉన్న విషయాలు నిజాలు కావా? అని ప్రశ్నించారు. అధికారిక సమావేశాల్లో మంత్రి కుమారులు పాల్గొంటున్నారనడానికి ఆధారాలు ఉన్నాయని, ప్రజాప్రతినిధులపై వార్తలు రాయడం జర్నలిస్టుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప, కిడ్నాప్ చేసినట్లు ఎత్తుకెళ్లడం సరికాదన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్న కూటమి ప్రభుత్వం.. కూటమి పాలనలో ప్రశ్నించే ప్రతి ఒక్క గొంతును నొక్కి పెట్టడం సరికాదన్నారు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను, విలేకరులను వరుసగా వేధిస్తున్నారని.. ఆళ్లగడ్డలో రమణ, నంద్యాలలో జాకీర్ వంటి జర్నలిస్టులపై గతంలో జరిగిన దాడులను ఈ సందర్భంగా గుర్తుచేశారు. పోలీసులు స్వతంత్రంగా వ్యవహరించకుండా ప్రభుత్వ తొత్తులుగా మారి పావులుగా ఉపయోగపడటం సిగ్గుచేటన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో చూపని దూకుడును, జర్నలిస్టులను వేధించడంలో చూపడం దారుణమని, పోలీసు వ్యవస్థ తమ స్వతంత్రతను కోల్పోవడం శోచనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టులపై వేధింపులు ఆపి, వెంటనే వారిపై మోపిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలోనే ప్రజలే ఈ అరాచక పాలనకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

## విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం.

**నంద్యాల ప్రతినిధి సెప్టెంబర్ 09 (నంది పత్రిక):-** నంద్యాల జిల్లా పోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కోసం స్వచ్ఛమైన మంచి నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు ఇదే పాఠశాల యందు పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ముందుకు రావడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్థులు కొనియాడారు.స్థానిక పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు వివిఎన్ .సంజీవ లక్ష్మి తన సొంత నిధులు రూ. 65,000 వెచ్చించి ఏర్పాటు చేసిన ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె స్వయంగా ఆర్.ఓ. ప్లాంట్ స్విచ్ ఆన్ చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందజేశారు.ఆమె మాట్లాడుతూ.. "విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై శ్రద్ధ చూపగలరు. కలుషిత నీటి వల్ల పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు, పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ చిన్న ప్రయత్నం చేశాను" అని తెలిపారు.విద్యార్థుల తాగునీటి కష్టాలను తీర్చడానికి ముందుకు వచ్చిన ఉపాధ్యాయురాలి ఉదారతను హెచ్.ఎమ్, ఇతర ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశుడు,రాజు,చాంద్ బాషా, జిలాని, దేవనాల శ్రీనివాసులు, దేవనూరు శ్రీను ,రాజమ్మ,సుచరిత కరీమా,జమీలా,మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పాత్రికేయులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**బేతంచెర్ల సెప్టెంబర్ 9 ( నంది పత్రిక ).** నంద్యాల పట్టణంలో ఐ న్యూస్ ఛానల్ పాత్రికేయులపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, బేతంచెర్ల మండల ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష,కార్యదర్శులు నాగ మధు, వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఐ న్యూస్ విలేకరులు సురేష్, నాగచంద్రలపై నమోదైన నాన్-బెయిలబుల్ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరుతూ బేతంచెర్ల డిప్యూటీ తహశీల్దార్ మారుతికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు తమ విధులు నిర్వహిస్తున్న సమయంలో వారిపై కేసులు నమోదు చేయడం సరి కాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాత్రి కేయులపై పెట్టిన కేసులను వెంటనే ఉప సంహరించుకుని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఎపి డబ్ల్యూబేతంచెర్ల మండల ఉపాధ్యక్షులు పోల నాగరాజు, సహాయ కాయదర్శి కత్తి సుబ్బరాయుడు, ట్రెజరర్ మదన భూపాల్ నాయుడు, బండ రాముడు,మద్దిలేటి స్వామి విలేఖర్లు పాల్గొన్నారు.



# పోరుమామిళ్లలో 'సిండికేట్' దందా

## క్వార్టర్ బాటిల్‌పై రూ. 10 నుండి 20 అదనం. చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 8( నంది పత్రిక )** వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని వైన్ షాపులు నిబంధనలను నిలువునా పాతర వేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ట విక్రయ ధరలకే (మ్యాగ్జిమమ్ రిటైల్ ప్రైస్ - మద్యం విక్రయించాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి మద్యం బాటిల్‌పై, ముఖ్యంగా క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ. 10 నుండి రూ. 20 వరకు వసూలు చేస్తూ సామాన్య ప్రజలను, గిరాకీదారులను నిలువునా దోచుకుంటున్నారు. ఈ బహిరంగ దోపిడీపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ, స్థానిక ఎక్సైజ్ (ఎక్సైంజ్) అధికారులు మాత్రం 'మాకేమీ పట్టనట్టు' చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

**ఎంఆర్‌పీ బోర్డులు మాయం.. బెల్ట్ షాపుల హల్‌చల్**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ విధానంలో భాగంగా ప్రతి వైన్ షాపు ముందు స్పష్టంగా కనిపించేలా విక్రయ ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించింది. కానీ పోరుమామిళ్ల మండలంలోని పలు దుకాణాల్లో ఈ బోర్డులు ఎక్కడా కనిపించవు.ఒకవేళ ఉన్నా,వాటిని వినియోగదారులకు కనపడకుండా మరుగున పెడుతున్నారు.విక్రయదారులను ధరల గురించి ప్రశ్నిస్తే."పైనుంచే మాకు అదనపు ఖర్చులు ఉన్నాయి, ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే లేదు" అంటూ దురుసుగా సమాధానం ఇస్తుండటం గమనార్హం. మరోవైపు మండలంలోని పల్లె ప్రాంతాల్లో అనధికారిక బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.ఈ బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసేందుకు వైన్ షాపుల నిర్వాహకులు నిలకడగా ధరలను పెంచేసి, కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆగ్రహం**

పోరుమామిళ్లలో జరుగుతున్న ఈ మద్యం దందాపై ఇటీవలే సీపీఎం వంటి ప్రజా సంఘాలు మరియు రాజకీయ పార్టీలు తీవ్ర నిరసనలు వ్యక్తంచేశాయి. మద్యం విక్రయాల్లో జరుగుతున్న ఈ అక్రమ వసూళ్లను అరికట్టడంలో ఘోరంగా విఫలమైన స్థానిక ఎక్సైజ్ అధికారులపై, ముఖ్యంగా సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పై ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

**ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతర్!1**

కొన్ని నెలల క్రితమే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్రవ్యాప్తంగా ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ వసూలు చేసినా సదరు దుకాణానికి మొదటి విడతగా రూ. 5 లక్షల జరిమానా విధించాలని, అక్రమాలు పునరావృతమైతే ఏకంగా లైసెన్స్ రద్దు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. అయినప్పటికీ, పోరుమామిళ్ల మండలంలో ఈ ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.

**ఎక్సైజ్ అధికారుల కళ్లప్పగింత.. మత్తులో ఉన్నారా?**

పోరుమామిళ్ల కేంద్రంగా ఇంత పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లు జరుగుతున్నా ఎక్సైజ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పెద్ద 'మామూళ్ల' కథే నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుకాణాల నిర్వాహకులతో అధికారులు లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకున్నారని, అందుకే తనిఖీల పేరిట కేవలం నామమాత్రపు చర్యలు చేపడుతూ కాలయాపన చేస్తున్నారని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.పోరుమామిళ్ల మండలంలోని మందుబాబులు మరియు సామాన్య పౌరులు ఈ అక్రమ వసూళ్లపై నిశ్శబ్దంగా ఉండిపోకుండా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.టోల్-ఫ్రీ నెంబర్: అక్రమ మద్యం అమ్మకాలు మరియు ఎంఆర్‌పీ ఉల్లంఘనలపై టోల్-ఫ్రీ నెంబర్ 14500 లేదా హెల్ప్‌లైన్ నెంబర్ 0866-2575051 కు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. మీ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి.పోరుమామిళ్ల మండలంలో సాగుతున్న ఈ అక్రమ దోపిడీకి అడ్డుకట్ట పడాలంటే జిల్లా ఉన్నతాధికారులు మరియు కడప జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ తక్షణమే రంగంలోకి దిగాల్సి ఉంది. ఇక్కడి మద్యం దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వినియోగదారుల నుండి అదనంగా వసూలు చేస్తున్న సొమ్మును అరికట్టాలని, అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న స్థానిక అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని పోరుమామిళ్ల మండల ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు



# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ టి రవి**





**కొత్తపల్లి - నంది పత్రిక:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వరమే చికిత్సలు అందించాలని శ్రీశైలం ఐటీడీఏ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ రవి తెలిపారు. బుధవారం మండలంలోని ఎర్ర మఠం, గోకవరం, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలోని, పరిసరాలను, రికార్డులను, ఓపి సేవలను పరిశీలించారు ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో ఉన్న రోగుల బెడ్లు, పరిసరాలను పరిశీలించారు. స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్ స్టేట్ క్లీనెస్ సర్వేను వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు, శానిటేషన్ పైన అవగాహన కల్పించారు. రోగులకు చికిత్సలు అందించే బెడ్స్ ను, సింకులను, టాయిలెట్స్ ను పరిశు భ్రంగా ఉంచుకోవాలని. ఆస్పత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు ఈ కార్యక్రమంలో వైద్యులు ద్వీప నాగవేణి, రమ్యకృష్ణ, డాక్టర్ ఉపేంద్ర హకీమ్ రషీద్, సుష్మ సాయి వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# శక్తియాప్ మహిళలకు రక్షణ

**- ఏఎస్ఐ నూర్ ఆహమ్మద్**



**కొత్తపల్లి - నంది పత్రిక :** శక్తియాప్ వల్ల మహిళలకు రక్షణ ఉంటుందని శక్తి యాప్ అవెర్నెస్ టీం సిబ్బంది. పాములపాడు ఏఎస్ఐఐ నూర్ ఆహమ్మద్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి శక్తియాప్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'శక్తి యాప్ ' గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా అపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని చెప్పారు. 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పారు. సైబర్ క్రైమ్ జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ తో మెలుగుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఆడపిల్లలను ఈవిటీజింగ్ ' పేరుతో ఎవరైనా ఆకతాయిలు అల్లరి పట్టించడం లాంటివి చేస్తే ఏ మాత్రం అధైర్య పడకుండా, మీకు భరోసాను, ధైర్యాన్ని ఇచ్చే మీకు రక్షణ ఉండేలాగా శక్తీ యాప్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# రుద్రవరంలో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

**అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 09 (నంది పత్రిక):** స్థానిక ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో విద్యార్థినుల ఆరోగ్యం, భద్రతను ఉద్దేశించి శుక్రవారం ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ప్రముఖ సినీ హీరో అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'సర్వైకల్ క్యాన్సర్' (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) పై అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.

**సదస్సులో వివరించిన ముఖ్య అంశాలు:** ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సర్వైకల్ క్యాన్సర్‌కు గల కారణాలు, దాని లక్షణాలు మరియు నివారణ మార్గాలను విద్యార్థినులకు సవివరంగా తెలియజేశారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి ముందస్తు పరీక్షల ప్రాముఖ్యతను, అలాగే క్యాన్సర్ రాకుండా అడ్డుకునే 'హెచ్‌పీవీ (వ్యాం)' వ్యాక్సిన్ అవసరాన్ని వివరించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని, శరీరంలో ఏవైనా అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**నిర్వాహకులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు:** కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల ఆరోగ్యానికి ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని కొనియాడారు. ఇలాంటి చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రజనీ, ఉపాధ్యాయ బృందం, అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగుల కొత్త పెంచన్ గడువు ఈనెల 30వరకు పొడిగించాలి.



**బేతంచెర్లసెప్టెంబర్9 (నందిపత్రిక).** ఎపి.రాష్ట్ర కూటమి ప్రభుత్వం కొత్త పెంఛన్లు దరఖాస్తు గడువు ఈనెల 30వరకు వరకు గడువు పొదగించాలని, రాష్ట్ర కూటమి ప్రభుత్వ ను విజ్ఞప్తి చేస్తున్నామని స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పీట్ల మద్దిలేటి, బి.రాముడు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం అధ్యక్షులు మాట్లాడుతూ మండల అధికారులు, క్షేత్రస్తాయిలో వున్న అధికారులు అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగునికి న్యాయం జరిగేలా పింఛన్లు మంజూరు చేయాలనీ కోరుతున్నామని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి దరఖాస్తు ల గడువులొ భాగంగా దివ్యాంగులకు కొన్ని నిబంధనలు తాగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని,అలాగే, పింఛన్ దరఖాస్తు దారుల ఇబ్బందులు ను దృష్టిలో ఉంచుకొని, దరఖాస్తు గడువును పొడిగించి దివ్యాంగులకు ప్రతి ఒక్కరికి సమానంగా ఆవకాశం కల్పించి, గతంలో దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం 2025లొ ఆసుపత్రి కి దివ్యాంగులు వైద్య పరీక్షలు చేయించు కున్న వారికీ స్వర్ణ గ్రామ వార్డు సచివాలయల నుంచి ఇంత వరకు మెడికల్ సర్టిఫికెట్లురాలేదన్నారు,కావున ప్రభుత్వం దిబ్యాంగులకు సర్టిఫికెట్ లు వెంటనే పెండింగ్ వున్న వాటిని మంజూరు చేసి, కొత్త పెంచన్ ల గడువు ను పొడిగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని బుధవారం తెలిపారు.ఈ కార్యక్రమంలో బేతంచెర్ల స్ఫూర్తి దివ్యాంగుల సభ్యులు రామ మోహన్, రామాంజనేయులు,శకుంతల, సురేష్,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల సంక్షేమం కోసం మినీ గోకులం షెడ్లు.... ఎంపీడీవో భాగ్యలక్ష్మి.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 09 (నంది పత్రిక):** పాడి రైతుల సంక్షేమ కోసం మినీ గోకులం షెడ్లు ఎంతో ఉపయోగ పడతాయని మండల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం మండలంలోని ఆర్ కొత్తూరు గ్రామంలో రైతు బండారు బాలరాజు కు మంజూరైన మినీ గోకులం షెడ్డు నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వి బి జి రామ్ జి ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 30 మినీ గోకులం షెడ్లు నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఒక్కో మినీ గోకులం షెడ్డు నిర్మాణం కోసం రూ2 లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ మినీ గోకులం షెడ్లలో పాడి గేదెల పెంపకం చేపట్టి రైతులు అభివృద్ధిలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వి బిజీ రామ్ జి ఉపాధి హామీ పథకం ఈసి సుబ్బన్న, వీఆర్వో నీలకంఠేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అరవింద నాయక్, ఉపాధి టిఏ లు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, టిడిపి నాయకులు అల్లడి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ వెంకటసుబ్బయ్య,బండారు దస్తగిరి, పలువురు అధికారులు రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా దాతల సహకారంతో నిర్మించిన కళ్యాణమండపం ప్రారంభం.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 09 (నంది పత్రిక):** మండల కేంద్రం రుద్రవరంలోని పడమటి వీధిలో వెలసిన శ్రీ ప్రతాపరుద్ర ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల విరాళంతో సుమారు రూ15 లక్షల తో నిర్మించిన కళ్యాణ మండపాన్ని బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ పూజారి శివ, మరియు గ్రామ పెద్దలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారణాసి గోపి శర్మ మాట్లాడుతూ ప్రతాప రుద్రు ఆంజనేయ స్వామి ఆలయమునకు పూర్వం నుంచి ఎంతో ప్రతిష్ట ఉందన్నారు. ప్రతాపరుద్ర మహారాజు పరిపాలించే కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు ఆనవాళ్లు చెబుతున్నాయన్నారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో బాల వీరప్ప మరియు గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ఆలయం పునర్నిర్మించడం జరిగిందన్నారు. అప్పటినుంచి భక్తులు ఆలయంలో ధూప దీప నైవేద్యాలతో ఆలయం విరాజిల్లుతూ వచ్చిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో రుద్రవరంలో కాపురం ఉంటూ వృత్తిరీత్యా బెంగళూరులో స్థిరపడినటువంటి బోయ చెన్నయ్య ప్రతాపరుద్ర ఆంజనేయ స్వామి ఆలయంలో కళ్యాణ మండపం లేకపోవడంతో శుభకార్యములు చేసుకోవాలంటే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విషయాన్ని గ్రహించి కళ్యాణ మండప నిర్మాణానికి తన వంతు సహాయంగా అక్షరాల రూ8 లక్షల రూపాయల విరాళము ఇచ్చి తమ భక్తీని చాటుకున్నారు. అందుచేత గ్రామ పెద్దలు మరియు ఆలయ కమిటీ సభ్యులు బోయ చెన్నయ్య కుటుంబ సభ్యులతో కళ్యాణ మండపం ప్రారంభోత్సవం చేయించారని ఆయన అన్నారు. అదేవిధంగా ఆలయ సమీపాన భోజనశాల సౌకర్యార్థం రెడ్డి పల్లె ఎద్దుల పుష్పరాజు అలీసమ్మ దంపతులు రేకుల షెడ్డు నిర్మాణం నిమిత్తము తమ వంతు సహాయ సహకారాలు అందించారనితెలిపారు. ఆంజనేయస్వామి పై భక్తితో ఆసక్తి కలిగిన భక్తులు విరాళాలు ఇచ్చి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా అర్చకులు వారణాసి గోపి శర్మ మరియు గ్రామ పెద్దలు కోరారు. ఈ కార్యక్రమంలో పూజారి శివ, గ్రామ పెద్దలు ఎల్.వి రంగనాయకులు, అల్లాడి శేఖర్,నల్లగట్ల వెంకటేశ్వర్లు, నల్లగట్ల సత్యనారాయణ, వంకధారా శ్రీనివాసులు, ఈడిగ కానాల వెంకట నరసింహులు, బోయ ఓబులేసు, రజాక్, బొంత కాశయ్య ,ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: అంగన్‌వాడీ టీచర్లు



**మహానంది సెప్టెంబర్ 09 (నంది పత్రిక):** పౌష్టిక ఆహారంతోనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు నాగపుష్పలత, చంద్రకళ, సావిత్రమ్మ , పుష్పకళ పేర్కొన్నారు.బుధవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 'మన అంగన్‌వాడీ - మన బాధ్యత' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, అలాగే చిన్న పిల్లలకు ఎంతో నాణ్యమైన, పోషణ విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఈ పౌష్టిక ఆహారాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో నీటి ఎద్దడిని నివారించాలి, చేతిపంపులకు మరమ్మతులు చేయాలి : సీపీఎం




**నంది పత్రిక ఆత్మకూరు..** వేసవి కాలం ముగుస్తున్న పట్టణంలో ని మార్కెట్ యార్డ్ ట్యాంక్ నుంచి మున్సిపాలిటీ వారు వదిలే నీరు రోజు మరిచి రోజు వదులుతున్నారు. ఈ మధ్యకాలంలో రెండు రోజులకు ఒకసారి వదులుతున్నారు. కావున నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకొని నీటి సమస్య లేకుండా చూడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, అన్నారు.ఈ సందర్భంగా ఏ. రణధీర్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో ప్రస్తుతం 32 వార్డులు వార్డులున్నాయని, వీటి పరిధిలో దాదాపు 60 వేల నుంచి 70 వేల వరకు జనాభా ఉంటుందన్నారు. ఈ జనాభాను దృష్టిలో ఉంచుకుని నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గతంలో ప్రభుత్వాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చాలా వార్డుల్లో ప్రజలు నీటిని కొనుగోలు చేసిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. ఈ వేసవిలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. చాలా వార్డుల్లో చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయని, వాటికి మరమ్మతులు చేయించి వాడుకలోకితీసుకురావాలన్నారు. కుళాయిలు లేని ప్రాంతాల్లోని ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోకుండా ఉండేలా చూడాలని, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రభుత్వమే నీటిని సరఫరా చేయాలని డిమాండ్చేశారు. అలాగే పట్టణంలో నాన్ అమృత్ (ఏ ఏ ఐ ఐ వి )పథకం దాదాపు 117 కోట్లతో ప్రారంభించి, ఆరు సంవత్సరాలు దాటుతున్న ఆస్కీము నేటి వరకు పూర్తి కాలేదన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజల దాహార్తి తీర్చకుండా నిర్లక్ష్యం వహిస్తే సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ నాయకులు డి. రామ్ నాయక్, ఏ. సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, జి నాగేశ్వరరావు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అమలు చేయాలి



**చాగలమరి సెప్టెంబర్ 9 నంది పత్రిక** చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం విద్యాశాఖ అధికారులు శేషశయనారెడ్డి, సయ్యద్ న్యామతుల్లా లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రికార్డులను పరిశీలించి విద్యా బోధనపై ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సుబ్బరాయుడు, హెచ్ఎం హరిబాబు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్యం, సంక్షేమానికే ప్రాధాన్యత ...





**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ రాష్ట్రీయ ఏకతా దివాస్ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఉచిత మెగా వైద్య శిబిరం.**

**జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 254 మంది సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు అత్యాధునిక వైద్య పరీక్షలు... ఉచితంగా మెడిసిన్ పంపిణీ.**

**ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ పిలుపు.**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (రాష్ట్రీయ ఏకతా దివస్) పురస్కరించుకుని కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ నిరంతరం శ్రమించే పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ ద్యాన్ క్యూర్' (చికిత్స కంటే నివారణ మిన్న) అనే సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఏదైనా అనారోగ్యం రాకుండా ముందుగానే అడ్డుకోవడం ఉత్తమమైన మార్గమన్నారు. ఒకవేళ జబ్బు వస్తే ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులువవుతుందన్నారు. చాలామంది గత ఏడాది పరీక్షలు చేయించుకున్నాం కదా అని నిర్లక్ష్యం చేస్తుంటారన్నారు. కానీ మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయకపోవడం, పెరుగుతున్న వాతావరణ కాలుష్యం , జన్యుపరమైన కారణాల వల్ల శరీరంలో ఎప్పుడు ఎలాంటి మార్పులు వస్తాయో తెలియదన్నారు. అందుకే క్రమం తప్పకుండా కనీసం సంవత్సరానికి ఒకసారైనా బేసిక్ బ్లడ్ టెస్టులు, యూరిన్ టెస్ట్, లివర్ ఫంక్షన్ , కిడ్నీ ఫంక్షన్ వంటి ప్రాథమిక పరీక్షలన్నీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా ఇంకా చాలామందిలో సరైన అవగాహన లేక పరీక్షలకు దూరంగా ఉంటున్నారన్నారు. పోలీసు శాఖలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. పోలీసుల సంక్షేమం కోసం వైద్య పరీక్షలు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ సేవలను అందించిన జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ యాజమాన్యానికి, వైద్య బృందానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ సిఈఓ,డాక్టర్స్ బృందాన్ని ఎస్పీ శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 254 మందికి పోలీసు అధికారులు, సిబ్బంది , వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బి.పి , రాండమ్ బ్లడ్ షుగర్ , కంప్లీట్ బ్లడ్ పిక్చర్ , లిపిడ్ ప్రొఫైల్ , ఈసీజీ , 2డి ఎకో , ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష, (బోన్ డెన్సిటీ టెస్ట్) ఎముకల సాంద్రత పరీక్ష, వినికిడి పరీక్ష లు చేశారు. వైద్యులు తగిన ఆరోగ్య సలహాలు అందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా , కృష్ణమోహన్ ,జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ సీఈఓ చంద్రశేఖర్ , ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు , జనరల్ మేనేజర్ నదీమ్ , పోలీస్ వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి గారు, డిపిఓ ఎఓ జగన్నాథరావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు , సీఐలు, ఆర్ఐలు, డీపీఓ సిబ్బంది, వైద్య సిబ్బంది మరియు పోలీసు కుటుంబాలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుని ఘన సన్మానం.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 09 (నంది పత్రిక):** మండలంలోని ఎల్లావత్తుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. బుధవారం పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు నరసింహయ్య ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చి వారి ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడే వ్యక్తి ఒక ఉపాధ్యాయుడే అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజం గెలిచింది




**నంది పత్రిక ఆత్మకూరు..** సీఎం చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్టు చేసి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలో టిడిపి శ్రేణులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యువనేత నారా లోకేష్ పిలుపు మేరకు, "నిజం గెలవాలి" అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు 53 సంఖ్య ను కొవ్వొత్తులతో అమర్చి వెలిగించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తమ సంఘీభావం తెలిపారు. అప్పట్లో ఆయనపై పెట్టిన కేసులు పూర్తిగా అసత్యమైనవని, రాజకీయ కక్షసాధింపులో భాగంగానే అరెస్టు చేశారని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ప్రజల కోసం నిబద్ధతతో, నిజాయితీగా పని చేసే నాయకుడినిఅప్రజాస్వామికంగా అణచివేయాలని చూసినా, అంతిమంగా న్యాయమే గెలిచిందని వారు స్పష్టం చేశారు. కష్టాలను ఎదుర్కొంటూ నిప్పులాంటి రాజకీయం చేసిచంద్రబాబు, ప్రజాక్షేత్రంలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ప్రజల విజయం అని నాయకుల, కార్యకర్తలు కొనియాడారు.

## రాష్ట్రంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు అందించాలి...

**బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.పి.వి.సుబ్బారావు..**

**ఆళ్లగడ్డ, ప్రతినిధి సెప్టెంబర్ 9, నంది పత్రిక** ,రాష్ట్రంలో బ్రాహ్మణ వృద్ధులకుబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ల .ను అందించాలనిబ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.పి. వి. సుబ్బారావు ఒక పత్రికా ప్రకటన లో తెలిపారు. ఆయన బుధవారం ఆళ్లగడ్డ లో మీడియా ప్రతినిధులతోమాట్లాడుతూ,. గతంలో తెలుగు దేశంప్రభుత్వముఅధికారంలోకి వచ్చిన తరువాత బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లను ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారని, అలాగే ఈ సారి కూడా బ్రాహ్మణ సంక్షేమ సంస్థ కార్పొరేషన్ ద్వారానే వృద్ధాప్య పెన్షన్లను బ్రహ్మణులకు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు నాయుడుని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని, రాష్ట్రమంత్రినారా లోకేష్ బాబుని కోరారు. బ్రాహ్మణ కుటుంబాల లోని వయోజనవిద్యవృద్ధులకు రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా వృద్ధాప్య పింఛన్లు అందించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.పి.వి. సుబ్బారావు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు.



## అక్రమ అరెస్టుపై 'నిజం గెలిచింది'.. బాబు నిజాయితీ ముందు తలవంచిన కుట్రలు: గౌరు వెంకటరెడ్డి ధ్వజం

**మాధవినగర్ క్యాంప్ కార్యాలయం వద్ద ఘనంగా 53 దీపాల వెలుగుల సంఘీభావం**

**వైసీపీ కక్ష సాధింపు రాజకీయాలు బట్టబయలయ్యాయి: నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్**



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** రాజకీయ కక్షతో, అక్రమ కుట్రలతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును జైలుపాలు చేసిన చీకటి రోజులకు కాలం సమాధానం చెప్పిందని, చివరికి న్యాయమే గెలిచిందని టీడీపీ సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, మాధవినగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం "నిజం గెలిచింది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి గౌరు వెంకటరెడ్డి 53 దీపాలను వెలిగించి చంద్రబాబుకు ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు:రాజకీయ కక్షతోనే అక్రమ కారాగారవాసం: గత వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి, ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు నాయుడును రోడ్డు మార్గంలో కోర్టుకు తరలించి పైశాచిక ఆనందం పొందిందని మండిపడ్డారు. నిప్పులాంటి నాయకుడు: ఏ తప్పూ చేయకపోయినా ఒక నిష్కళంక ప్రజా నాయకుడిని 53 రోజుల పాటు జైల్లో బంధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యక్తిత్వం నిప్పులాంటిది కాబట్టే న్యాయస్థానాలు, ఈడీ సైతం ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చి కుట్రల ముసుగును తొలగించాయని తేల్చిచెప్పారు. ప్రజల తీర్పుతో వైసీపీకి చెంపపెట్టు: అసత్య ఆరోపణలతో నాయకుడిని వేధించిన వారికి ప్రజలు, చట్టం సరైన గుణపాఠం చెప్పాయని, ఇప్పటికైనా వైసీపీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే. పార్వతమ్మ, ప్రముఖ నాయకులు ఎన్వీ రామకృష్ణ, వాకటి మధేష్, ప్రభాకర్ యాదవ్, జవ్వాజి గంగాధర్ గౌడ్, మరెన్న, కురువ ధనుంజయ, దేవేందర్ రెడ్డి, శేఖర్ చౌదరి, డివి చంద్ర, శేష సాయి, పోలి రెడ్డితో పాటు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైయస్సార్ సిపి బిసి కార్యకర్త పామక్క గారి వెంకట సుబ్బయ్య ను పరామర్శించిన రెడ్యం.

**సరైన వైద్య సేవలు అందించాలని డా॥అనిల్ కుమార్ రెడ్డిని కోరిన రెడ్యం.**



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 09** ఖాజీపేట మండలం, త్రిపుర వరం చెందిన వైయస్సార్ సిపి కార్యకర్త తన స్వగృహం పై నుండి క్రిందపడి కాలు విరిగి కడప నగరంలోని భారతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరాడు. కాలికి శస్త్ర చికిత్స జరిగింది. వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైయస్సార్ సిపి తవ్వారుపల్లెకు చెందిన నేత కాటయ్య గారి నాగ సుబ్బారెడ్డి లు బుధవారం సాయంత్రం పరామర్శించి... జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఆర్థోపెడిక్ వైద్యుడు డా॥అనిల్ కుమార్ రెడ్డితో రెడ్యం మాట్లాడి సరైన వైద్య సేవలు అందించాలని కోరారు. త్వరిత గతిన వెంకటసుబ్బయ్య కోలుకోవాలని రెడ్యం ఆకాంక్షించారు.

## లోకేష్ ని కలసిన కోట్ల సూర్య కోట్ల రాఘవేంద్ర



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ : 09** ఉండవల్లి నివాసంలో గౌరవనీయులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి డోన్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలన్నింటినీ మంత్రి నారా లోకేష్ శ్రద్ధగా విని, ప్రభుత్వ స్థాయిలో వీటి పై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## అండర్ 17 ఖో ఖో పోటీలలో విద్యార్థుల ప్రతిభ



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 9 నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణం వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాంశాలలో ఈనెల 8 న జరిగిన అండర్ 17 బాలుర ఖో- ఖో పోటీలలో పాలసాగరం జడ్పీహెచ్ ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో గెలుపొంది ట్రోఫీ,1000 రూ.నగదు బహుమతి, మెడల్స్ సర్టిఫికెట్లను పొందినట్లు హెచ్ఎం మురళీధర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాబు ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయక పండుగ ప్రశాంతంగా జరుపుకోండి...

**శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు...**

**డి.ఎస్.పి శ్రీనివాసరావు**



**చాగలమర్రి సెప్టెంబర్ 9 నంది పత్రిక** వినాయక పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, గొడవలు, సంబరాల ముసుగులో అల్లర్లు సృష్టించి, శాంతి భద్రతలకు విగాథం కలిగించరాదని వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ( డి.ఎస్.పి ) శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పాత పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ రమణ, పీస్ కమిటీ సభ్యులు మాట్లాడారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ గ్రహ ఏర్పాటుకు సింగిల్ విండో సిస్టం ద్వారా ఆన్లైన్ లో రిజిస్టర్ చేసుకోవచ్చున్నారు. విగ్రహ ఏర్పాటులో ఎవరికి ఆటకం కలగకుండా కమిటీ సభ్యులు చూడాలన్నారు. పండుగ సంతోషంగా జరుపుకోవాలని తప్ప, విషాదం కలిగించే చర్యలకు పాల్పడరాదని ఆయన సూచించారు. విద్యుత్ శాఖ ఏఈ రమణ, ఎంపీడీవో తాహిర్ హుస్సేన్, చాలు మరి ఈవో, తదితరులు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కమిటీ సభ్యులు ఆర్గనైజర్స్ ను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. నిమజ్జనం రోజున వీలైనంత త్వరగా ముగించాలన్నారు. నిమజ్జనం రోజు చిన్నపిల్లలు, వృద్ధులను తీసుకురావద్దని హెచ్చరించారు. గతంలో కొన్ని చిన్నపిల్లలు నిరంజనం రోజు చనిపోవడం, బాణా సంచికలు పేలి మృతి చెందిన సంఘటనలు గుర్తు చేశారు. ఇలాంటి విషాద సంఘటనలు చోటు చేసుకోకుండా మతసామరస్యానికి ప్రతీకగా పేరొందిన చాగలమర్రి వాసులు జాగ్రత్త పడాలని తెలిపారు. ప్రార్థన ఆలయాలకు సమీపంలో, పాఠశాలలకు సమీపంలో, వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా చూసుకోవాలన్నారు. అల్లర్లు సృష్టిస్తే వీడియో ద్వారా చట్టపురమైన చర్యలు తీసుకుంటామని డిఎస్పి తెలిపారు.

## బాలిక ఆచూకీ కోసం విజ్ఞప్తి



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్09(నంది పత్రిక):-** నంద్యాల జిల్లా నంద్యాల మండలం చాబోలు నుంచి నంద్యాలకు వచ్చే హైవే గ్రామ పరిసర ప్రాంతాల్లో ఈ బాలిక కనిపించిందని అధికారులు తెలిపారు. బాలికను రక్షించి, సంరక్షణ నిమిత్తం బాలల సంక్షేమ సమితి ముందు హాజరుపరిచారు. విచారణలో తన పేరు దుర్గ భవాని, స్వస్థలం మంగళగిరి అని తెలిపింది. ప్రస్తుతం బాలిక నంద్యాల జిల్లాలోని బాలసదనంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాలికను గుర్తించిన వారు తగిన ఆధారాలతో జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి లేదా జిల్లా బాలల సంరక్షణ అధికారిని సంప్రదించాలని కోరారు. వివరాలకు 8919334858 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు ప్రారంభం..



**చాగలమర్రి సెప్టెంబర్ 9 నంది పత్రిక** మన అంగన్వాడి మన బాధ్యత అనే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా చేస్తున్న తొమ్మిదవ జాతీయ పోషణ మహోత్సవాలను ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల బుధవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా చేస్తున్న తల్లి బిడ్డ పోషణ కార్యక్రమాలు బాధ్యతాయుతంగా చేస్తానని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు జీవయ్య, హెల్త్ సూపర్వైజర్ రామలింగారెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, హెల్త్ అసిస్టెంట్లు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డకు సరియైన పోషణ అందేలా కృషి చేస్తానని, తాజా వైవిధ్యమైన పోషకాహారాన్ని ప్రోత్సహిస్తామని, పిల్లల ఆరోగ్యం సంరక్షణ, ఆటపాటలతో కూడిన అభివృద్ధికి తోడ్పడతామని ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడి సేవలకు సమాజంతో కలిసి బలోపేతం చేస్తామని, మంచి పోషణ కుటుంబం, ఆరోగ్యవంతమైన సమాజం కోసం మన వంతు బాధ్యత నిర్వహిస్తూ సమిష్టిగా కృషి చేయాలని ఆమె తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

**చాగలమర్రి సెప్టెంబర్ 9 నంది పత్రిక** చాగలమర్రి మండలం నుండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పుట్టాలయ్య,ప్రవీణ లక్ష్మి,మాలేపాటి జానకి అలాగే రోటరీ క్లబ్ ద్వారా జిల్లాస్థాయిలో ఉత్తమ టీచర్లు గా అవార్డు పొందిన మద్దూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవీంద్రారెడ్డి, ఆయన సతీమణి సుధా కుమారి లను స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంఈఓ లు శేషశయనా రెడ్డి, సయ్యద్ న్యామతుల్లా లు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు వారిని అభినందించారు. హెచ్ఎం రవీంద్రారెడ్డి మద్దూరు పాఠశాలను తమ స్వంత నిధులతో అభివృద్ధి చేశారన్నారు.



# కడపను దక్షిణ భారతదేశంలో ప్రధాన పెట్టుబడి కేంద్రంగా తీర్చిదిద్దుతాం..!







## 'ఇన్వెస్ట్ కడప' సెంటర్ ను ప్రారంభించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## పెట్టుబడిదారులకు భూమి నుంచి అనుమతుల వరకు సంపూర్ణ చేయూత

## ఒకే వేదికపై అన్ని సేవలను అందించేలా పోర్టల్ అందుబాటులోకి

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక :** వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉన్న కడపను పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్ది, రానున్న రోజుల్లో దక్షిణ భారతదేశంలోనే ప్రధాన పెట్టుబడి కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ కడప'ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటైన 'ఇన్వెస్ట్ కడప' కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, పలువురు పారిశ్రామికవేత్తలు, నైపుణ్య నిపుణులు, పెట్టుబడిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని పెట్టుబడి అవకాశాలు, వనరులు, సామర్థ్యాలను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు.. పెట్టుబడిదారులు తమ ఆలోచనతో కడపకు వచ్చిన రోజు నుంచి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు భూమి, వనరులు, అనుమతులు, వివిధ శాఖల సమన్వయం వంటి ప్రతి అంశంలో సంపూర్ణ చేయూత అందించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమన్నారు. ఒక పెట్టుబడిదారుడు తన ఆలోచనతో 'ఇన్వెస్ట్ కడప'కు వచ్చినప్పుడు.. జిల్లాలో పెట్టుబడులకు అనువైన ప్రాంతాలు, పారిశ్రామిక భూముల లభ్యత, వనరులు, నీటి సౌకర్యం, విద్యుత్, రహదారి అనుసంధానం తదితర వివరాలను అందిస్తామని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు చేసుకునే విధానం నుంచి ఆమోదం పొందే వరకు మార్గదర్శకత్వంఎ అందించడంతో పాటు, భూమి కేటాయింపు అనంతరం అవసరమైన అనుమతులన్నింటినీ పొందేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తామని చెప్పారు. పెట్టుబడిదారులు వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే కేంద్రం ద్వారా అన్ని సేవలను అందించడమే 'ఇన్వెస్ట్ కడప' ప్రత్యేకత అని తెలిపారు. సంక్లిష్టమైన ప్రాజెక్టులకు వివిధ శాఖల సమన్వయం అవసరమైనప్పుడు ఆ సమన్వయ బాధ్యతను కూడా ఈ కేంద్రం తీసుకుంటుందని చెప్పారు. బయటి రాష్ట్రాల పపెట్టుబడిదారులపఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే పెట్టుబడిదారులకు కడపలో అడుగుపెట్టిన మొదటి రోజు నుంచే చేయూత అందిస్తామని కలెక్టర్ తెలిపారు. వారికి అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించడం, భూములను సందర్శింప జేయడం, సాంకేతిక సందేహాలను నివృత్తి చేయడం, వనరులపై సమాచారం అందించడం, సంబంధిత శాఖలతో సమన్వయం చేయడం వంటి సేవలను అందిస్తామని తెలిపారు'ఇన్వెస్ట్ కడప' కేవలం పరిశ్రమల కోసం మాత్రమే కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యుత్, సౌర, పవన విద్యుత్, ఇంధనం, విద్యుత్ ప్రసారం, ఖనిజాల శుద్ధి, గనులుఖనిజాలు, పర్యాటకం, వాణిజ్యం, రియల్ ఎస్టేట్ తదితర రంగాల్లో పెట్టుబడులకు కూడా సహకారం అందిస్తామని తెలిపారు. ఐదు ఎకరాలకు పైబడిన భూ అభివృద్ధి, నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, సంబంధిత పురపాలక సంస్థలు, మండళ్లు, ఇతర విభాగాలతో సమన్వయం చేసి పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నైనైపుణ్జిల్లాకు వచ్చే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపైనా దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, విశ్వవిద్యాలయాలతో సమన్వయం చేసుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తద్వారా పరిశ్రమలకు నైపుణ్య సిబ్బంది లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పెట్టుబడుల నిర్ణయాల్లో గణాంకాలు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ఆర్థిక కార్యకలాపాలు, వివిధ రంగాల అభివృద్ధి ధోరణులు, పెట్టుబడి అవకాశాలను అర్థం చేసుకునేందుకు గత ఐదేళ్లకు సంబంధించిన గణాంకాలను 'ఇన్వెస్ట్ కడప'లో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ముఖ్యంగా మీడియా, పరిశ్రమలు, పెట్టుబడిదారులు అవసరమైన సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో పొందేలా వ్యవస్థను రూపొందించామని చెప్పారు. గణాంకాలను అవసరానికి అనుగుణంగా వెలికితీసేందుకు ప్రత్యేక సహాయక సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కేంద్రం ఉదయం నుంచి రాత్రి 89 గంటల వరకు సేవలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్లు వివరించారుపెట్టుబడిదారుల కోసం ప్రత్యేక 'ఇన్వెస్ట్ కడప' అంతర్జాల వేదికను అభివృద్ధి చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న భూముల వివరాలను ద్విమితీయ పటాల రూపంలో పొందుపరిచామని చెప్పారు. ఏ భూఖండం ఎక్కడ ఉంది.. ఎంత భూమి అందుబాటులో ఉంది.. సమీపంలో నీటి వనరులు, విద్యుత్ అనుసంధానం, రహదారి సౌకర్యాలు ఎలా ఉన్నాయి వంటి వివరాలను ఒకే వేదికపై తెలుసుకునేలా రూపొందించామని తెలిపారు. స్థానిక పెట్టుబడిదారులు, విద్యార్థి పారిశ్రామికవేత్తలు, యువ ఔత్సాహికులను ప్రోత్సహించడంలోనూ 'ఇన్వెస్ట్ కడప' కీలకంగా పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు. దీనికి సమాంతరంగా 'స్టార్టప్ కడప'ను కూడా త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 'స్టార్టప్ కడప' ద్వారా యువతలోని నూతన ఆలోచనలను ప్రోత్సహించడం, ఔత్సాహికులను నిపుణులైన మార్గదర్శకులతో అనుసంధానం చేయడం, దేశ, ప్రపంచ స్థాయిలోని అవకాశాలను పరిచయం చేయడం, అవసరమైన చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. 'ఇన్వెస్ట్ కడప', 'స్టార్టప్ కడప' రెండూ సమన్వయంతో పనిచేస్తాయని చెప్పారు. ఆకాంక్షి జిల్లా అభివృద్ధిలో నీతి ఆయోగ్ నిర్దేశించిన ప్రమాణాల్లో 80.6 శాతం లక్ష్యాలను అధిగమించి జాతీయ స్థాయిలో ముందంజలో నిలవడం జిల్లాకు గొప్ప విజయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విజయం జిల్లా యంత్రాంగం ఒక్కరి కృషితో సాధ్యమైనది కాదని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు, పారిశ్రామికవేత్తలు, మీడియా తదితరుల సమష్టి భాగస్వామ్యంతో సాధ్యమైందని తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం అభినందనీయమని, జాతీయ స్థాయిలో సాధించిన ఈ పురోగతి భవిష్యత్ అభివృద్ధికి ఒక ముఖ్యమైన దిశానిర్దేశంగా నిలుస్తుందని కలెక్టర్ అన్నారు. గత మూడు నెలలుగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి 'ఇన్వెస్ట్ కడప'ను అందుబాటులోకి తీసుకొచ్చారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించడం, పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడం ద్వారా కడప అభివృద్ధికి కొత్త దిశను చూపించడమే ఈ కేంద్రం లక్ష్యమన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన చేయూత, సమాచారాన్ని ఒకే వేదికపై అందించడం ద్వారా కడపను పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, వ్యాపారవేత్తలు, ఇన్వెస్టర్లు, ఎంటర్ప్రెన్యూర్స్ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి లక్షణాలు గుర్తించే ఇంటింటి సర్వే



**బద్వేల్, సెప్టెంబర్ 9 ( నంది పత్రిక ):** కుష్టు వ్యాధి ప్రారంభ దశలో లక్షణాలను గుర్తించుటకు కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమమును ఈనెల సెప్టెంబర్ 11వ తేదీ నుండి సెప్టెంబర్ 24వ తేదీ వరకు 14 రోజులపాటు ఆరోగ్య సిబ్బందితో నిర్వహించనున్నట్లు బద్వేలు డివిజన్లో పనిచేసే డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ బలపనూరు శంభు ప్రసాద్ తెలిపారు. గృహ సందర్శన సర్వే కార్యక్రమంలో ఆశా వాలంటీర్ మరియు గుర్తించిన మగవాలంటీరు టీం సభ్యులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమమును పర్యవేక్షించుటకు ఆ ఏరియా ఏఎన్ఎం సూపర్వైజర్ గా ఉంటారన్నారు. టీం సభ్యులు గృహ సందర్శన సమయంలో ఇంటిలోని ప్రతి ఒక్కరిని కుష్టు వ్యాధి ప్రారంభ దశలో లక్షణాలను శరీరం అంతా పరిశీలిస్తారని అలాగే ఈ వ్యాధికి సంబంధించిన అవగాహన సందేహాలను వివరిస్తారని తెలిపారు. సర్వే సమయంలో ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నాయని సందేహం వస్తే వారికి రెఫరల్ స్లిప్ ఇచ్చి సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వద్దకు పంపిస్తారు. అక్కడ వ్యాధి నిర్ధారణ చేసి సంబంధిత బహుళ ఔషధ చికిత్స మందులు వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నెలలు గాని 12 నెలలు గాని ఉచితంగా అందిస్తారు. కావున ప్రజలందరూ ఈ అవకాశమును సద్వినియోగం చేసుకొని సహకరించాలని వారు కోరారు. ప్రారంభ దశలోనే కుష్టు వ్యాధి ని గుర్తించి చికిత్స తీసుకున్నట్లయితే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని తెలిపారు. బద్వేలు డివిజన్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తొట్టిగారిపల్లి ,గోపవరం, బి.మఠం, పలుగురాళ్లపల్లి, బి .కోడూరు, టేకూరుపేట నర్సాపురం, కలసపాడు మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బద్వేల్ లోని గాంధీ నగర్, సురేంద్ర నగర్, మరియు కోట వీధి లకు తను ఇన్చార్జిగా ఉన్నట్లు వారు తెలిపారు. కుష్టు వ్యాధికి సంబంధించిన అవగాహన, సూచనలు, సలహాలు మరియు చికిత్స మందులు ఎల్లవేళలా అందిస్తామని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## యర్రగుంట్ల గ్రామానికి కేసి కెనాల్ కాలువకు నీరు విడుదల



**శిరివేళ్ళ:(నంది పత్రిక):** సిరివెళ్ల మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంట కాలువలు వేలవేల బోతున్న తరుణంలో మూగ జీవాలకు సైతం నీటి కోసం తల్లడిల్లుతున్న ఎ లివో ప్రభావంతో గ్రామంలో త్రాగునీరు సమస్య రాకుండా మందు జాగ్రత్తగా నీటి సంఘం అధ్యక్షుడు కమతం లక్ష్మిరెడ్డి యర్రగుంట్ల గ్రామ ప్రజలకు, రైతులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పగలు, రాత్రి తేడా లేకుండా కష్టపడి నేడు యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామానికి నేడు16 బ్లాక్ నుండి నేడు గ్రామానికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా నీటి సంఘం అధ్యక్షుడు కమతం లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ అహోర రాత్రులు కష్టపడుతూ నేడు గ్రామంలో జలకళ తీసుకురావడానికి ఎంతో కృషి చేశానని గ్రామంలోని రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకొని నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పొదుపుగా వాడాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూత్ లీడర్ ఎదుర్ల నాగ సురేష్, కె. బాల గురెడ్డి,కె. గోపాల్ రెడ్డి, రంజిత్ కుమార్ రెడ్డి, మనోహర్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల కోసమే కొత్త పెన్షన్లా?

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయాలి: పోతిరెడ్డి నాగార్జున రెడ్డి



**పోరుమామిళ్ల, సెప్టెంబర్ 9 (నంది పత్రిక ):** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలోనే ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరుకు చర్యలు చేపడుతోందని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ఆరోపించారు. గతంలో పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు నిరాశ కలగకుండా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దాదాపు రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడం, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడం వంటి అంశాల నేపథ్యంలో ఇప్పుడు కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటిస్తున్నారని విమర్శించారు. 2019లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా దిగిపోయే సమయానికి రాష్ట్రంలో సుమారు 39 లక్షల మందికి నెలకు రూ.2,000 చొప్పున పెన్షన్ అందేదని, 2024లో వైఎస్ జగన్ ప్రభుత్వం దిగిపోయే నాటికి మరో 27 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేసి, మొత్తం సుమారు 66 లక్షల 35 వేల మందికి రూ.3,000 చొప్పున పెన్షన్ అందించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే 2024 నుంచి ఇప్పటివరకు కొత్త పెన్షన్లు మంజూరు చేయలేదని, గతంలో పెన్షన్ పొందుతున్న సుమారు మూడున్నర లక్షల మందిని తొలగించారని నాగార్జున రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ముందు 50 సంవత్సరాలు పైబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ప్రస్తుతం 60 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించడం సరికాదని అన్నారు. సెప్టెంబర్ 16, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం విధించిన గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మూడు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని, ప్రస్తుతం రెండున్నర సంవత్సరాల తర్వాత కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పడం వల్ల ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేసి, గడువును పొడిగించాలని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గ్రామీణ విద్యార్థులకు సీఏజీఎల్ స్కాలర్షిప్ ల పంపిణీ



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ సంస్థ అండగా నిలిచింది. సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా ఎమ్మిగనూరు, నంద్యాల, బద్వేలు ప్రాంతాల్లో 'గ్రామీణ విద్యా ఉపకార వేతనాల' పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమానికి కర్నూలు జిల్లా అదనపు పోలీసు అధికారి హుస్సేన్ పీరా చేతుల మీదుగా అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల అభివృద్ధికి సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం, వారి చదువులకు ఆర్థిక సహకారం అందించడం, ఉన్నత విద్య వైపు వారిని నడిపించడమే తమ లక్ష్యమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాంతీయ నిర్వాహకుడు కె. గౌస్ పీర్, ప్రాంతీయ నిర్వాహకులు కార్తీక్, లక్ష్మీకాంత్ రెడ్డి, రామాంజనేయులు, ఏపీతెలంగాణ బాధ్యులు ఆరిఫుల్లా తదితరులు పాల్గొన్నారు. ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## 9వ జాతీయ పోషణ మాసం సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు జరుగుతాయి - ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 9 నంది పత్రిక** 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల గ్రామం లోని ఒకటవ అంగన్వాడి కేంద్రంలో ఈ కార్యక్రమం జరిగిందని ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఇందులో ముఖ్యంగా పిల్లల ఆహారంలో వైవిధ్యత తగినంత ప్రోటీన్ పిల్లలకి ఎంతో అవసరం కావున ప్రోటీన్ ఉన్న ఆహార పదార్థాలు పిల్లలకు తినిపించాలి ఆహారంలో ఎప్పుడు ఒకే రకమైన ఆహారం కాకుండా రోజుకు ఒక్కొక్క రకం ఆహారం పిల్లలకు తినిపించాలి తద్వారా పిల్లలు పెరిగి పెద్దవారైన తర్వాత కూడా అన్ని ఆహార పదార్థాలకు అలవాటు పడతారని కాబట్టి పిల్లలకు చిన్న వయసులోనే మంచి ప్రోటీన్ ఉన్న ఆహారం అందించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త పాల్గొన్నారు

# చీకట్లో మగ్గుతున్న వినియోగదారులు



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 9:** నిజం గెలిచింది అన్న కార్యక్రమంతో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి టిడిపి కార్యకర్తలు సంబరాలు చేసుకుంటుండగా, అప్రకటిత విద్యుత్ కోతలతో బండి ఆత్మకూరు మండల వినియోగదారులు చీకట్లో మగ్గిపోతున్నారు. గత నాలుగు రోజులుగా మండలంలో ఇదేవిధంగా విద్యుత్ అధికారులు కోతలు విధిస్తూ ఉండటంతో ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లినో ప్రభావం కారణంగా పగలు ఉక్కపోతలతో అల్లాడిపోతున్న ప్రజలకు, విద్యుత్ అధికారులు విధిస్తున్న విద్యుత్ కోతలు రాత్రిపూట చుక్కలు చూపిస్తున్నాయి. పగటిపూట అడపాదడపా గా కూలి పనులకు వెళ్లి పొట్ట పోసుకుంటున్న సామాన్య ప్రజలకు రాత్రిపూట విధిస్తున్న కరెంటు కోతలు వారిని మరింత ఇబ్బంది పెడుతున్నాయి. సామాన్య మహిళలు రాత్రిపూట చరవాణిల ద్వారా వంట చేసుకుంటూ అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు దోమలు కూడా ప్రజలను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పసిపిల్లలు వృద్ధులు, మహిళలు రాత్రిపూట కరెంటు లేక పోవడంతో వారు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పల్లె ప్రాంతాలలో ప్రతిరోజు రాత్రిపూట విద్యుత్ సరఫరాను లోడ్ రిలీఫ్ పేరుతో నిలిపివేస్తున్నారు. పట్టణాలలో మాత్రం యధావిధిగా విద్యుత్ సరఫరాను అమలు చేస్తున్నారు. పల్లె ప్రాంతాల ప్రజలు విద్యుత్తు అధికారులకు బిల్లులను చెల్లించడం లేదా? అలాంటప్పుడు సరఫరాను ఇవ్వడంలో ట్రాన్స్కో అధికారులు ఎందుకు పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోడ్ రిలీఫ్ పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న ట్రాన్స్కో అధికారులు, ఈ విధానాన్ని పగటిపూట అమలు చేస్తే తప్పేమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ట్రాన్స్కో అధికారిని ప్రశ్నిస్తే వస్తుందిలే బ్రదర్! అంటూ సమాధానం ఇస్తూ ఉండటం కొసమెరుపు.

## నంద్యాలలో ఘనంగా హజ్రత్ ఖ్వాజా సయ్యద్ 752వ ఉరుసు మహోత్సవం.



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 9 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో హజ్రత్ ఖ్వాజా సయ్యద్ 752వ ఉరుసు మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉరుసు మేళాలో నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి కౌన్సిల్ సభ్యులు దేశం సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, జిల్లా వైసీపీ సెక్రటరీ శివనాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కలం భాష ,శాదిక్ భాష, జాకీర్ హుస్సేన్, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, పద్మశ్రీ సుబ్బరాయుడు, మరియు దర్గా పెద్దలు తదితరులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా దర్గా ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా సాగిన ఈ ఉత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని నాయకులు పేర్కొన్నారు...





నంది పత్రిక

గురువారం 10 - 09 -2026

# సేవలోనే నిజమైన సంతృప్తి...

## ప్రభుత్వ వైద్యులు సల్మాఖాతున్ స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం.



**డోన్ :నంది పత్రిక సెప్టెంబర్ : 09** డోన్ పాత బస్టాండ్ నందు గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంకి 100 మందికి పైగా గర్భిణీలు హాజరవడం జరిగింది. ఈ యొక్క గర్భిణీలకు భోజన వసతి కల్పించండి అని ఆసుపత్రి వైద్య సిబ్బంది స్ఫూర్తి సేవా సమితి సాయం కోరగా స్పందించిన స్ఫూర్తి సంస్థ స్ఫూర్తి దాతల సహకారంతో గర్భిణీలకు భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సల్మా ఖాతున్ గారు మాట్లాడుతూ సేవలోనే నిజమైన సంతృప్తి ఉందని, అడిగిన వెంటనే గర్భిణీలకు మంచి రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేసిన స్ఫూర్తి సేవా సమితి వారికి, స్ఫూర్తి దాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సల్మాఖాతున్, హెల్త్ సూపర్వైజర్ వన్నూరు బాషా, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్స్, స్ఫూర్తి సభ్యులు భాస్కర్, మౌలాలి, మహమ్మద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ఎస్సీలకే రిజర్వేషన్లు వర్తింపజేయాలి



**నంద్యాల డీఆర్వోకు వినతిపత్రం అందజేత** మహానంది సెప్టెంబర్ 09 (నంది పత్రిక):-అర్హులైన హిందూ ఎస్సీలకు మాత్రమే రిజర్వేషన్లు వర్తించేలా సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తూ, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఎత్తున మద్దతు సంతకాల పత్రాలను అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న దళిత హిందూ ఎస్సీల నుంచి సేకరించిన ఈ మద్దతు సంతకాల పత్రాలను కలెక్టరు కార్యాలయంలో డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ మరియు ఎస్సీ ఎస్టీ హక్కుల వేదిక నాయకులు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా నిజమైన, అర్హులైన హిందూ ఎస్సీలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని దళితులందరూ ఈ తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారని, అందుకే స్వచ్ఛందంగా సంతకాల సేకరణలో పాల్గొన్నారని తెలిపారు. ఈ తీర్పును ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ సత్యం, జిల్లా కమిటీ సభ్యుడు మధుసూదన్, జిల్లా ధర్మ ప్రచారక్ శివప్రసాద్, జిల్లా ఎస్సీ ఎస్టీ హక్కుల వేదిక కన్వీనర్ చిన్న రామయ్య, ఎస్సీ ఎస్టీ హక్కుల సంఘం పెద్దలు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఉద్యోగులను, కార్మికులను పర్మనెంట్ చేయాలి : ఐ ఎఫ్ టి యు.



**నందికొట్కూరు సెప్టెంబర్ 9( నంది పత్రిక )**కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కార్మికులను పర్మినెంట్ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను భారత కార్మిక సంఘాల సమైక్య ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఈనెల 12న ఏలూరులో జరుగు రాష్ట్ర సదస్సు సంబంధించిన ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి అరుణ్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు నంద్యాల జిల్లా అధ్యక్షులు పి మజీద్ మీయ మాట్లాడుతూ కార్మికులను ఉద్యోగులను పర్మనెంట్ చేయకుండా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పద్ధతుల్లో కట్టు బానిసలుగా మార్చి వెట్టి చాకిరి చేయిస్తున్నాయని మండిపడ్డారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ కర్ణాటక తమిళనాడు మరియు ఒరిస్సా పంజాబ్ ఢిల్లీ రాష్ట్రాలలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేశాయని,ఒక ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం కార్మికులను ఉద్యోగులను చిన్నచూపు చూస్తూ పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా,సుప్రీంకోర్టు పలు దఫాలుగా కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మిట్ చేయాలని తీర్పు ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ పాలకులు అమలు చేయడం లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 19 21లను ఉల్లంఘిస్తున్నాయని ఆరోపించారు. కావున వెంటనే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు లేని పక్షంలో జన్ జి ఉద్యమంలా రాష్ట్రమంతటా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కే గోవిందు కార్యదర్శి శ్రీనివాసులు నాయకులు శేఖర్ ప్రతాప్ అశోక్ శీను రాజేష్ చిట్టెమ్మ రమణమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు

# డోన్ లో కొవ్వత్తుల కార్యక్రమం

**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ : 09** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ప్రియతమ నాయకులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ కేసులో అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిన ఈ రోజు డోన్ నియోజకవర్గంలో టీ డి పి నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపుతో కూడిన అప్పటి గొడ్డలి పార్టీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు పై తప్పుడు కేసులు బనాయించి ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే ప్రయత్నం చేసిందన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి ప్రజల గొంతు నొక్కాలని చూసినప్పటికీ, చివరికి సత్యం, న్యాయమే విజయం సాధించాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేయడం రాష్ట్ర చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచిపోయిందని, అందుకే ఈ రోజును బ్లాక్ డేగా గుర్తు చేసుకుంటున్నామని నాయకులు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, న్యాయ వ్యవస్థపై విశ్వాసంతో ఆయన మరింత బలంగా ప్రజల ముందుకు వచ్చారని అన్నారు. కొవ్వొత్తులు వెలిగించి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు, సత్యం మరియు న్యాయానికి తమ మద్దతును తెలియజేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన డీఎస్పీ రామాంజీ నాయక్





**నందికొట్కూరు సెప్టెంబర్ 9( నంది పత్రిక)** పగిడాల మండల పరిధిలోని ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ను బుధవారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజీ నాయక్ నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తో కలిసి తనిఖీ చేసి, స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించి, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. డీఎస్పీ రామాంజి నాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై నరేంద్ర లు నెహ్రూనగర్ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడారు. క్రిమినల్ కేసుల్లో పాల్గొంటే కలిగే పరిణామాలపై అవగాహన కల్పించి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, శక్తి యాప్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నెహ్రూనగర్ గ్రామంలోని కేసీ కాలువ మరియు కృష్ణా నది ఘాట్లను డీఎస్పీ రామంజి నాయక్ సందర్శించి, వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అవసరమైన సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బ్లాక్ డే గా పాటిస్తూ-- కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపిన టిడిపి శ్రేణులు.



**బేతంచెర్ల సెప్టెంబర్ 9( నందిపత్రిక ).** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుని అక్రమ కేసులో అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించిన రోజు సెప్టెంబర్ 9 వతేదిని,బ్లాక్ డేగా పాటిస్తూ, డోన్ నియోజకవర్గంలోని బేతంచర్ల పట్టణంలో, టిడిపి బేతంచెర్ల మండల కన్వీనర్, & శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్య,టిడిపి బేతంచెర్ల పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మీ ఆధ్వర్యంలో, టిడిపి బేతంచెర్ల మండల, పట్టణ నాయకులు,కార్యకర్తలు కలిసి బుధవారం నాడు కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపుతో కూడిన అప్పటి గొడ్డలి పార్టీ( వైసిపి) ప్రభుత్వం చంద్రబాబు నాయుడుపై, తప్పుడు కేసులు బనాయించి, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే ప్రయత్నం చేసిందన్నారు. అధికార దుర్వి నియోగానికి పాల్పడి, ప్రజల గొంతు నొక్కాలని చూసినప్పటికీ, చివరికి సత్యం,న్యాయమే విజయం సాధించాయని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేయడం రాష్ట్ర చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచి పోయిందని, అందుకే ఈ రోజు( 9 వతేది బుధవారం) ను బ్లాక్ డేగా గుర్తు చేసు కుంటున్నామని నాయకులు తెలిపారు. ప్రజల ఆశీస్సులు, న్యాయ వ్యవస్థపై విశ్వాసంతో ఆయన మరింత బలంగా ప్రజల ముందుకు వచ్చారని అన్నారు.కొవ్వొత్తులు వెలిగించి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు,సత్యం మరియు న్యాయానికి తమ మద్దతును తెలియ జేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది

## 53 కొవ్వొత్తులు వెలిగించిన చంద్రబాబు నాయుడు పై జరిగిన అన్యాయానికి ప్రజా తీర్పు సమాధానం లభించింది

## టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 9, నంది పత్రిక** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ కు మూడు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిజం గెలిచింది కార్యక్రమంలో బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, 53 కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై జరిగిన అన్యాయానికి ప్రజా తీర్పుతో సమాధానం లభించిందని, చివరకు నిజమే గెలిచిందని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ హుస్సేన్ భాష బీరువాల భాస్కర్ నాగాంజనేయులు చింతకుంట శేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# గడివేముల పల్లె వెలుగు నంది దినపత్రికలలకు ఏ.పీ.ఎంఎఫ్. ఆధ్వర్యంలో ఉత్తమ విలేకరులుగా సన్మానం..

**గడివేముల నంది పత్రిక** నంద్యాల జిల్లా గడివేముల మండలంలో పల్లె వెలుగు నంది పత్రికల విలేకరులకు పల్లె వెలుగు కే రాజేష్ బాబు, నంది పత్రిక వై.లివికుమార్ వీరికి నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షులు ఢిల్లీ బాబు రెడ్డి, మద్దిలేటి, నంద్యాల జిల్లా టీం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గడివే మండలం మండలానికి చెందిన తనదైన ఒత్తుల్లో మంచి ప్రతిభ కనబరిచి ప్రజలకు ఎప్పటికప్పుడు నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజలకు చరవిస్తూ ఉత్తమ రిపోర్టర్లుగా తమ సేవలందిస్తూ ప్రజల మండల పొందుతున్న వీరికి ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ వారు రాష్ట్ర కమిటీ వారు ఈరోజు వీరికి ఉత్తమం విలేకరుల ప్రకటిస్తూ మీమెంటు ద్వారా సన్మానించారు ఈ కార్యక్రమంలో అన్ని మండలాల విలేకరులు పాల్గొనడం జరిగింది..





# చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు: కొవ్వొత్తుల నిరసన

## "నిజం గెలవాలి" కార్యక్రమం

## 53 కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపిన తెలుగుదేశం శ్రేణులు



**వెలుగోడు, సెప్టెంబరు 09 (నంది పత్రిక):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని గతంలో అక్రమంగా అరెస్టు చేసి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు వెలుగోడు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువనేత నారా లోకేష్ పిలుపు మేరకు "నిజం గెలవాలి" అనే నినాదంతో వెలుగోడులోని టిడిపి మండల కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. చంద్రబాబు నాయుడు జైలులో గడిపిన 53 రోజులకు సంకేతంగా '53' సంఖ్య రూపంలో కొవ్వొత్తులను అమర్చి, వాటిని వెలిగించి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాటి వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులతో చంద్రబాబును వేధించినప్పటికీ, అంతిమంగా నిజమే గెలిచిందని, ప్రజల ఆశీస్సులతో మళ్లీ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త అన్నారపు శేషి రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు కలాం, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, సొసైటీ చైర్మన్ మండ్ల శంకర్ రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ డాక్టర్ జాకీర్ హుస్సేన్,బూత్ కన్వీనర్లు సానా శీను, శ్రీను, మెడికల్ రాము, సంజీవయ్య, మాజీ ఎంపిటిసి రమణ, కేశవ గౌడ్, మధు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, నల్ల కాలువ వలి, రాందాస్ మరియు మండల నాయకులు, గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు

## మహానందిలో టీడీపీ శ్రేణుల కొవ్వొత్తుల నిరసన



**మహానంది సెప్టెంబర్ 09 (నంది పత్రిక):-** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాజకీయ దురుద్దేశంతో, కుట్రపూరితంగా అక్రమ కేసులో అరెస్టు చేసి నేటికి సరిగ్గా మూడేళ్లు పూర్తయినట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు కంచర్ల శివ శంకర్ చౌదరి, మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం ఇదే రోజున రాజకీయ కక్షసాధింపుతో, అర్ధరాత్రి వేళ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. ఎలాంటి తప్పు చేయకపోయినా కుట్రపూరితంగా 53 రోజుల పాటు జైలులో నిర్బంధించి, మానసికంగా వేధించారని ధ్వజమెత్తారు. నాటి చీకటి రోజును నిరసిస్తూ, ప్రజాస్వామ్య రక్షణను కాంక్షిస్తూ 'నిజం గెలిచింది' అనే నినాదంతో మహానందిలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. నాడు జగన్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు నిలబడలేదని,చివరకు ధర్మమే జయించి చంద్రబాబు నాయుడు మళ్లీ ప్రజాదరణతో ముఖ్యమంత్రి అయ్యారని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఉల్లి మధు , శ్రీశైలం మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ రవి స్వామి,మాజీ సర్పంచ్ అస్లాం బాషా ,టీడీపీ నాయకులు ,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# రూ.17.25 లక్షల నగర పంచాయతీ నిధులతో పైప్‌లైన్ నిర్మాణ పనులు.

## పరిశీలిస్తున్న బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి.



**బేతంచెర్ల సెప్టెంబర్ 9( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణము సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న సంపు నుంచి, పాత బస్టాండ్ సమీపంలోని చిన్న హైస్కూల్ వరకు, ప్రధాన రహదారి వెంట,సుమారుగా 1625 మీటర్ల పొడవుతో, కొత్త పైప్ లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని బేతంచెర్ల నగర పంచాయితీ చైర్మన్‌సిహెచ్. చలం రెడ్డి తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత పట్టణంలోని కోటపేట,తాసిల్‌పేట,పాత తహసీల్దార్ కార్యాలయం, డాక్టర్ నాగరాజు సందు, అన్నారావు ఇంటి ముందున్న రోడ్డు, మండల అగ్రికల్చర్ ఆఫీస్ రోడ్డు, మెయిన్ బజార్, జండాపేట, ఆసర్ పేట మొదలగు ప్రాంతాలకు ప్రస్తుతం ఏడు రోజులకు ఒకసారి సరఫరా అవుతున్న నీరు,రాబోయే కాలంలో రెండు రోజులకు ఒకసారి అందే అవకాశం ఉంటుందని, చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి అన్నారు. బేతంచెర్ల పట్టణంలో 17లక్షల 25 వేల రూపాయలు నగర పంచాయతీ నిధులతో చేపడుతున్న,ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులను చైర్మన్ చలం రెడ్డి బుధవారం పరిశీలించారు. పైప్ లైన్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని నగర పంచాయతీ సిబ్బందికి చైర్మన్ సూచించారు.

# గతంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసనగా కొవ్వొత్తులతో నిరసన తెలిపిన టీడీపీ నాయకులు..



**నంది పత్రిక గడివేముల** నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గ గడివేముల మండలంలో గతంలో చంద్రబాబునాయుడు అక్రమంగా అరెస్టు చేసి దానికి గాను ఎటువంటి నేరచరిత్ర లేకుండా 53 రోజులు కక్ష సాధింపు తో జైల్లో ఉంచి నిజమే గెలిచిందన్న విధంగా చివరకు చంద్రబాబునాయుడు గతంలో జైలు నుంచి బయటకు రావడంతో దానికి అరెస్టుకు నిరసనగా బుధవారం సాయంత్రం గడివేముల మండలంలోని అన్ని గ్రామాలు టిడిపి మండల కన్వీనర్ దిలీప్ కుమార్ రెడ్డి సహకార సంఘం అధ్యక్షులు దేశంసత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో గడివేముల గ్రామంలో నిజం గెలిచింది కార్యక్రమం ను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ ల నాయకులు సంగిభావం తెలిపారు,, ఈ కార్యక్రమం లో గడివేముల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దేశం సత్య నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ పంట దిలీప్ రెడ్డి, పాణ్యం బీసీల అధ్యక్షులు కృష్ణ యాదవ్, బొల్లవరం సుభద్రమ్మ, ఒడ్డు లక్ష్మీదేవి, టిడిపి మండల సీనియర్ నాయకుడు బిడుదురి సీతారాం రెడ్డి, రమణారెడ్డి,అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి....

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**
**ఆదోనిలో శాంతి కమిటీ సమావేశం...**
**ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం.**
**సోషల్ మీడియా పుకార్లను నమ్మొద్దు...**
**ధ్రువీకరించకుండా పార్వర్డ చేయొద్దు.**
**ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలి.**
**నిమజ్జన ఘాట్ ను పరిశీలించిన... ఎస్పీ.**

**కర్నూల్ సిటీ నందిపత్రిక** వినాయక చవితి వేడుకలను అందరూ కలిసి , మెలిసి ఆనందంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పిలుపునిచ్చారు. బుధవారం ఆదోని పురపాలక సంఘం కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, ప్రజలు, వ్యాపార వర్గాలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అన్ని మతాల మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండుగలను సంతోషంగా ప్రారంభించి, ప్రశాంతంగా ముగించుకోవాలన్నారు.

పోలీసు శాఖ అనవసరమైన ఆంక్షలు విధించదని, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని తెలిపారుఅన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.**

నిమజ్జన ఊరేగింపులను సకాలంలో పూర్తి చేసి, రాత్రివేళ ఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక మండపాల వద్ద 24 గంటలూ కమిటీ సభ్యులు లేదా వాలంటీర్లు అందుబాటులో ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మండపాల వద్ద తాత్కలిక సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

డీజేలు, అధిక శబ్దాలకు దూరంగా ఉండి ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని ధ్రువీకరించకుండా ఫార్వర్డ్ చేయరాదన్నారు. చిన్న సంఘటనలు పెద్ద సమస్యలుగా మారకుండా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని చిన్న మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.



వినాయక చవితి వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. అనంతరం చిన్న హరివాణం దగ్గర ఉన్న కెసికెనాల్ కాలువ నిమజ్జనం ఘాట్ ను ఎస్పీ పరిశీలించారు. ఈ సమావేశంలో ఆదోని మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహమ్మద్, తహసీల్దార్ వేణుగోపాల్, ఆదోని డీఎస్పీ వెంకటరమణ, స్పెషల్ బ్రాంచ్ సీఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, ఆదోని పట్టణ సీఐలు రాజశేఖర్ రెడ్డి, నల్లప్ప, రామలింగయ్య, చంద్రశేఖర్, ఇస్పి ఎస్సై మహేష్ కుమార్, వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు, అన్ని మతాల మత పెద్దలు పాల్గొన్నారు.

## నారా చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు రాజమండ్రి జైలులో పెట్టి వేధించినందున జగన్ మోహన్ రెడ్డికి ప్రజలు 11 సీట్లతో బుద్ధి చెప్పారు.

**- సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కుడా చైర్మన్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** సెప్టెంబర్ 9 రాష్ట్ర చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోయే రోజు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నాటి వైసీపీ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చగా నిలిచిందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఈ రోజు వారి గృహం నుండి పత్రికల వారితో మాట్లాడారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబు నాయుడు ఎక్కడా అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా నిజాయితీ, నిబద్ధతతో తెలుగు ప్రజలకు సేవలందించారని తెలిపారు. "నిజం ఎప్పటికీ ఓడిపోదు.. నిజాయితీ ఎప్పటికీ తలవంచదు" అన్న విషయాన్ని చంద్రబాబు నాయుడుగారి రాజకీయ ప్రస్థానం మరోసారి నిరూపించిందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, నాటి వైసీపీ పెద్దల అవినీతి, అక్రమాలను ప్రజల ముందుకు తీసుకువస్తున్నారనే అక్కసుతోనే స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారంతా ఏకతాటిపైకి వచ్చి, నాటి వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలను ఎండగట్టారని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎటువంటి అవినీతి, అక్రమాలు జరగకపోయినా కక్ష సాధింపు చర్యల్లో భాగంగా చంద్రబాబు నాయుడు ని అరెస్ట్ చేసి 53 రోజుల పాటు రాజమండ్రి జైలులో ఉంచడం జరిగింది అని పేర్కొన్నారు. న్యాయస్థానాల తీర్పులతో కూడా చంద్రబాబు నాయుడు నిజాయితీ, నిబద్ధతకు బలం చేకూరిందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు నాయుడు కి క్లీన్‌చిట్ రావడం నిజానికి, న్యాయానికి లభించిన విజయమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారని అన్నారు.

## 100% ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యం

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** నగరంలోని 137 సచివాలయాల పరిధిలో 100% ఇంటింటి చెత్త సేకరణే లక్ష్యంగా కొత్తగా అందుబాటులోకి వచ్చిన విద్యుత్ ఆటోలను సమర్థవంతంగా వినియోగించుకునేలా పిన్ పాయింట్ ప్రోగ్రామ్‌ను పక్కాగా రూపొందించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుద్ధ్య పర్యవేక్షక యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఈ-ఆటోలు కేటాయించిన పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ-ఆటోలకు కేటాయించిన మైక్రో పాకెట్ల పరిధిలో ప్రతి ఇంటి నుంచి చెత్తను 100 శాతం సేకరించేలా సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి వాహనం తనకు కేటాయించిన ప్రాంతంలో పూర్తిస్థాయిలో తిరిగేలా పిన్ పాయింట్ ప్రోగ్రామ్‌ను రూపొందించుకోవాలని సూచించారు. ఈ-ఆటో డ్రైవర్ సెలవు కారణంగా విధులకు గైర్హాజరైనా లేదా వాహనం మరమ్మత్తులకు గురైన చెత్త సేకరణకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందుగానే సిద్ధంగ చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. వాహనాల వినియోగం, రోజువారీ చెత్త సేకరణ, కేటాయించిన మైక్రో పాకెట్లలో ఇంటింటి చెత్త సేకరణపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. నగరంలో 100% ఇంటింటి చెత్త సేకరణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే విధంగా సచివాలయ కార్యదర్శులు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ-ఆటోల ద్వారా చెత్త సేకరణ వ్యవస్థను మరింత పటిష్టం చేసి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



## నిజం గెలిచిందంటూ కొవ్వొత్తుల ర్యాలీ



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 9** :నిజం నిప్పులాంటిదిఎంతకాలం దాచినా ఎప్పటికైనా బయటకు వస్తుంది." తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ నారా చంద్రబాబు నాయుడు అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో ఉంచిన ఘటనకు మూడు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, "నిజం గెలవాలి" కార్యక్రమంలో భాగంగా బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ.కోడూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది.

**చంద్రబాబు నాయుడు గారు ఒక వ్యక్తి మాత్రమే కాదు** నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో తన విజన్‌తో పనిచేసిన నాయకుడు. రాజకీయాల్లో ఎత్తుపల్లాలు సహజం. కానీ అధికారం ఉన్నప్పుడు ప్రజాస్వామ్య విలువలు, గౌరవం, హుందాతనం పాటించాలి అనేది ఈ ఘటన మనకు గుర్తు చేస్తున్న ముఖ్యమైన పాఠం. ఇది ఒక్క పార్టీకి మాత్రమే గుణపాఠం కాదుడ

ప్రస్తుత అధికార పార్టీ నాయకులతో సహా ప్రతి రాజకీయ నాయకుడు, ప్రతి పార్టీ కూడా దీని నుంచి ఒక విషయం నేర్చుకోవాలి. అధికారం శాశ్వతం కాదు. పదవులు శాశ్వతం కాదు. ప్రజలే అసలైన యజమానులు. ప్రజల తీర్పే అంతిమ తీర్పు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మంచి చేస్తే ప్రజలు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. కానీ అధికారాన్ని వ్యక్తిగత కక్షలకు, రాజకీయ ప్రతీకారాలకు ఉపయోగిస్తేడ కాలమే దానికి సమాధానం చెబుతుంది. గత ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన 11 సీట్ల తీర్పు కూడా రాజకీయ నాయకులందరికీ ఒక బలమైన ప్రజాస్వామ్య సందేశం.

ఈరోజు అధికారం ఒకరి చేతిలో ఉండవచ్చు రేపు మరొకరి చేతిలో ఉండవచ్చు.

కానీ ప్రజల తీర్పు మాత్రం ఎప్పటికీ అత్యున్నతమైనది. అందుకే ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు మంచి చేయాలి, కార్యకర్తలను గౌరవించాలి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కంచర్ల లింగారెడ్డి , నర్ల నాగేశ్వరరెడ్డి

మధుసూదన్ రెడ్డి , మోహన్ రెడ్డి ,శంకర్ రెడ్డి , శివకుమార్ ,హనుమంత్ రెడ్డి జయరామిరెడ్డి ,శంకర్ ,సుబ్రహ్మణ్యం ,చంద్ర మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పాల్గొని కొవ్వొత్తుల శాంతి ర్యాలీని విజయవంతం చేశారు.

## చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు లో నిజం గెలిచింది కర్నూల్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** 2023 సెప్టెంబర్ 9న గౌరవ ముఖ్యమంత్రివర్యులు, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేసి, 53 రోజుల అనంతరం 2023 అక్టోబర్ 31న రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి ఆయన విడుదలైన ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశంపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాల మేరకు ఈ రోజు కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు యాదవ్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బొందిలి కార్పోరేషన్ చైర్మన్ విక్రం సింఘ్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం ఎదుట, విశ్వేశ్వరయ్య సర్కిల్ నందు "నిజం గెలిచింది" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 53 కొవ్వొత్తులు వెలిగించి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్ల తమ సంఘీభావాన్ని చాటారు. కార్యక్రమానికి కర్నూలు నగర పార్టీ అధ్యక్షులు కొరకంచ రవి కుమార్, రాష్ట్ర స్థాయి కార్పోరేషన్ డైరెక్టర్లు నంద్యాల నాగేంద్ర, ఎల్.వి.ప్రసాద్, డి.జేంస్, పోతురాజు రవికుమార్, మన్సూర్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు సోమిశెట్టి శ్రీకాంత్, సత్రం రామక్రిష్ణుడు, రామాంజనేయులు, కుంపటి క్రిష్ణ, నరసిమ్హులు, విజయ లక్ష్మి, బాబు రావు, నాగార్జున చౌదరి, పి.హనుమంతరావు చౌదరి, దేవదాస్, రాజు యాదవ్ మొదలగు వారితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ మూడు సంవత్సరాలైనా సందర్భంగా దీపాలను వెలిగించి సంఘీభావం తెలిపిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మాధవి నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు సీనియర్ నాయకులు నందికొట్కూరు టీడీపీ ఇంచార్జ్ గౌరు వెంకట రెడ్డి ఆధ్వర్యంలో నిజం గెలిచింది కార్యక్రమమును నిర్వహించడం జరిగింది నారా చంద్రబాబు నాయుడు ని అక్రమ కేసులో 53 రోజులు నిర్బంధించి మూడేళ్లు అయినందున ఈ 53 రోజుల నిర్బంధాన్ని ప్రతిబింబించేలా నిరసిస్తూ 53 దీపాలను వెలిగించి సంఘీభావం తెలిపిన ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ మరియు 16 వార్డుల ఇన్చార్జిలు సీనియర్ టిడిపి నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలి - సిపిఐ



**కర్నూల్ సిటీ నందిపత్రిక** నిత్యవసర ధరలు విపరీతంగా పెరుగుతూ సామాన్య ప్రజలకు అందరిని దాక్షగా మారుతున్నాయని నిత్యాసం ధరలు తగ్గించి సామాన్యులకు అందుబాటులో తెచ్చే విధంగా పాలకులు చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి మహేష్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి లు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబల్ ఇంజన్ సర్కార్ నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతూ ప్రజల నడ్డి విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అసమర్థత వల్ల ధరలు పెరుగుతా ఉంటే వాటిని నియంత్రించలేక బంగారు కొనొద్దని, ఇంధనం పొదుపుగా వాడాలని, విదేశీ టూర్లు వెళ్ళొద్దని నిస్సిగ్గుగా చెబుతున్న పాలకులు ఇప్పుడు బియ్యం, బ్యాలు, చక్కెర గ్యాస్ వంటి రేట్లు పెరుగుతా ఉంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు చక్కెర తింటే షుగర్ వస్తదని అందుకే రేట్లు పెంచుతున్నారని చెప్పడం హాస్యాస్పదమన్నారు దేశ ఆర్థిక స్థితి గురించి దేశ ప్రజల ఆరోగ్యం గురించి ఎలాంటి అవగాహన లేని బిజెపి పాలకుల వల్లే దేశని అధోగతి పట్టిందన్నారు, ఈ సంవత్సరం ఏలినో ప్రభావం వలన వర్షాలు లేక పోవడం వలన రైతులు వ్యవసాయ కూలీలు సరైన ఉపాధి లేక ఆందోళన చెందుతా ఉంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా రోజురోజుకి బియ్యం, చక్కెర, కందిబేలు, వంటనూనె, విపరీతంగా పెరుగుతా ఉన్నాయి అని కానీ సామాన్యుల ఆదాయం పెరగడం లేదని దీనివల్ల ప్రజలు వారికి వచ్చే ఆదాయంలో అన్ని వస్తువులు కొనలేక పౌష్టికాహారం భుజించగా ఆరోగ్యం క్షీణించి పోతుందని కావున ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరల స్థిరీకరణకు నిధిని ఏర్పాటు చేసి సామాన్య మధ్య తరగతి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు అలా కాకుండా పాలకులు నిర్లక్ష్యం వ్యవహరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి పి శ్రావణ రెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, నగర సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు వి నాగరాజు, బిసన్న, వెంకటేశు ఈశ్వర్ నల్లన్న భద్ర కుమార్, కిట్టు, అన్వర్, సి కుమార్ అశోక్, మహిళా సమైక్య నాయకురాలు ధనలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, సులోచనమ్మ, మునెమ్మ, కళాకారులు డప్పు మాణిక్యం, శ్రీనివాసులు, మల్లీ, నగర నాయకులు ప్రసాదు బి నాగరాజు, అఖిల్, చంటి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ ఆర్ ఐ విభాగం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గురు రాజా కి శుభాకాంక్షలు తెలిపిన కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** తెలుగుదేశం పార్టీ ఎన్ ఆర్ ఐ విభాగం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ గురు రాజా ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ గుడిసె ఆది కృష్ణమ్మ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో డాక్టర్ గురు రాజా ఎన్ ఆర్ ఐ విభాగం అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ ఆయనను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విదేశాల్లో నివసిస్తున్న తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేసేలా ఎన్ ఆర్ ఐ విభాగం పనిచేయాలని ఆకాంక్షించారు. డాక్టర్ గురు రాజా నాయకత్వంలో ఎన్.ఆర్.ఐ విభాగం మరింత చురుగ్గా పనిచేసి పార్టీకి అండగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ గురు రాజా కి తన తరఫున, కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ శ్రేణుల తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మార్కెట్ యాడ్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు,రామచంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జమ్మూ కాశ్మీర్ లో పర్యటించిన కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూల్ సిటీ నందిపత్రిక** వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణి పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ జమ్మూకాశ్మీర్ లో పర్యటించింది.. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిధి అధ్యక్షతన సాగుతున్న ఈ పర్యటనలో కమిటీ సభ్యుడిగా ఉన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.. పర్యటనలో భాగంగా కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్ లో వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణి పై అడిషనల్ చీఫ్ సెక్రటరీ, ఆహార శాఖ కార్యదర్శి మరియు ఉన్నతాధికారులతో కమిటీ సమావేశం నిర్వహించింది.



# అంబారుపేట అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరో ముందడుగు





## రూ.36 లక్షలతో విలేజ్ వెల్నెస్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన

## గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

## ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో రూ. 36 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న విలేజ్ వెల్నెస్ హెల్త్ సెంటర్ భవనానికి కూటమి నేతలతో కలిసి ఆమె శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులతో పాటు ప్రజారోగ్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంబారుపేటలో నిర్మించనున్న వెల్నెస్ హెల్త్ సెంటర్ ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, వైద్య సదుపాయాల విస్తరణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. నందిగామ నియోజక`వర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని తంగిరాల సౌమ్య తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు_న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# స్కిల్ మంథన్ వేదికపై మన రైజ్..!





## - గ్రామీణ మహిళా సాధికారతలో వినూత్న చొరవకు గుర్తింపు

## - జాతీయస్థాయి గౌరవం సమష్టి కృషికి దక్కిన ఫలితం

## - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక**

గ్రామీణ మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పిస్తూ, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్సహించేందుకు జిల్లాలో అమలుచేస్తున్న రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ (రైజ్) కార్యక్రమానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగం, స్వయం సహాయక సంఘాల మహిళలు, భాగస్వామ్య సంస్థల సమష్టి కృషికి దక్కిన ఫలితమని పేర్కొన్నారు.

విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం అధికారులతో కలిసి కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ మంథన్ వెబినార్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. మహిళలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, మహిళలను స్వయం ఉపాధి, పారిశ్రామిక రంగాల వైపు ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ వెబినార్‌ను నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత రంగాల్లో జిల్లాల స్థాయిలో అమలవుతున్న వినూత్న కార్యక్రమాలు, ఉత్తమ విధానాలను జాతీయ స్థాయిలో పరస్పరం పంచుకునేందుకు 'స్కిల్ మంథన్'ను వేదికగా రూపొందించారు. ఈ వెబినార్‌ను మహిళలకు స్థిరమైన జీవనోపాధి నిర్మాణం అనే అంశంపై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో మహిళల జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి కోసం అమలుచేస్తున్న వినూత్న కార్యక్రమాలను ప్రదర్శించారు. అందులో ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన రైజ్ కార్యక్రమాన్ని కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. వెబినార్ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఒక కుటుంబం ఒక పారిశ్రామికవేత్త ఆలోచనకు అనుగుణంగా మహిళలను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది, వారి సామర్థ్యాలను ఆదాయ వనరులుగా మలచే దిశగా గుంటుపల్లిలోని రైజ్ కేంద్రం పనిచేస్తోందన్నారు. నీతి ఆయోగ్, సెర్ప్ తదితర శాఖల సహకారంతో విజయవంతంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రైజ్ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేస్తూ, ఎన్‌టీఆర్ జిల్లాను మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలను వినియోగించాలి

## వినాయక విగ్రహాల ప్రతిష్టాపన, నిమజ్జనానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలి

## శబ్ద కాలుష్యాన్ని నియంత్రించాలి

## ట్రాఫిక్కుకు అంతరాయం లేకుండా పటిష్టమైన బందోబస్తు చేయాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** రానున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలు మట్టి విగ్రహాలను వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి వినాయక చవితి సందర్భంగా చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో, పర్యావరణ హితంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున వాటి వినియోగాన్ని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా అవి నీటిలో సులభంగా కరిగిపోతాయని, తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. వినాయక విగ్రహాల ప్రతిష్టాపన, నిమజ్జనం సమయాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు, విద్యుత్ తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలన్నారు. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ బాక్సులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మట్టి విగ్రహంపర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యత" అనే సందేశంతో వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణ హితంగా జరుపుకోవాలని ఆమె



కోరారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం కోసం వాహనాలు నడిపే వారికి తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్సు ఉండేలా చూడాలన్నారు. రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచే యాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ ,డిఆర్ఓ పి. గ్లోరియా, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, సూర్యారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కండి:

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**శాఖల సమన్వయంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి**

**సమస్యాత్మక ప్రాంతాలు, రహదారుల గుర్తింపు, పటాల రూపకల్పన పూర్తి చేయాలి...**

**శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై బైండోవర్ చర్యలు చేపట్టాలి...**



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, అన్ని శాఖల మధ్య సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి వాటిని సున్నిత ప్రాంతాలుగా గుర్తిస్తూ పటాల రూపకల్పన ప్రక్రియను పూర్తి చేయాలని పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక రహదారులను ముందుగానే గుర్తించి మార్గ పటాలను సిద్ధం చేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, భద్రతా సిబ్బంది రాకపోకలకు అవసరమైన మార్గాలను ముందుగానే గుర్తించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా కుల, మతపరమైన అంశాలకు సంబంధించి ఉద్రిక్తతలు లేదా ఘర్షణలు చోటుచేసుకునే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది, రవాణా, భద్రత తదితర అంశాలపై ముందస్తుగా సమీక్షించుకుని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులను, ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించి వారిపై నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, నిబంధనల ప్రకారం బైండోవర్ చర్యలు చేపడతామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా కుల, మతపరమైన ఉద్రిక్తతలకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఆయా ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి గ్లోరియా, జిల్లా రవాణా శాఖ అధికారి ఎం వివి కృష్ణారావు, ఆర్డీవోలు సూర్యారావు, కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసి రాజు, రహదారులు భవనాల శాఖ ఎస్ సి ఏ శ్రీనివాస్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం ఎలైట్ యాంటీ నారకోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్( ఈగల్) పై జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అజ్మి తో కలిసి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ యుక్త వయసు నుంచే మాదక ద్రవ్యాల వినియోగ దుష్పరిణామాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై వారి భవిష్యత్తులను నాశనం చేసుకోవద్దని తెలిపారు. యువతకు పాఠశాల స్థాయి నుంచే డ్రగ్స్, గంజాయి వంటి ప్రాణాంతకర ముత్తుపదార్థాల వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నారు. కళాశాల, పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం పట్ల దుష్పరిణామాల వలన కలిగే నష్టం అర్థమయ్యేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ మత్తుపదార్థాల ఎగుమతి, వినియోగం జరగకుండా పటిష్టమైన బందోబస్తులను ఏర్పాటు చేయాలని అన్నారు. కళాశాలలు, పాఠశాలలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. "డ్రగ్స్ వద్దు బ్రో" అనేది కేవలం ఒక స్లోగన్ మాత్రమే కాదని, జీవితాన్ని కాపాడుకునే ఒక మార్గదర్శక సూత్రం అని అన్నారు. తాత్కాలికమైన ఉపశమనం కోసం డ్రగ్స్ వైపు వెళితే జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. దీనివలన ఆరోగ్యం, కుటుంబం, కెరీర్, మానసిక ప్రశాంతతకు దూరమై జీవితం అంధకారంలోకి వెళ్ళిపోతుందని అన్నారు. యువత గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలకు బానిసై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని అన్నారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడానికి "ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్" అత్యంత చురుగ్గా పనిచేస్తోందని అన్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద ఎవరైనా డ్రగ్స్ ను వినియోగించిన, విక్రయించినట్టు పట్టుబడిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అద్నాన్ నయీమ్ అజ్మి మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించడానికి ప్రభుత్వం 'ఈగిల్' విభాగాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. జిల్లా పరిధిలో మత్తు పదార్థాలు వినియోగించే, విక్రయించే అసాంఘిక శక్తులపై ఎప్పటికప్పుడు పరివేక్షించడం జరుగుతున్నదని అన్నారు. ఎవరైనా వ్యక్తులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలను తరలిస్తూ పట్టుబడితే చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. మత్తు పదార్థాల రవాణా లేదా వినియోగానికి సంబంధించి ప్రజలు ఎలాంటి సమాచారమైనా అందించడానికి ఈగిల్ ఫోర్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు ఫోన్ చేసి చెప్పవచ్చని అన్నారు. అట్టి వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. యువతకు మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది అన్నారు. నరసాపురంలో డి ఎడిక్షన్ సెంటర్ ను ప్రారంభించడం జరిగిందని అన్నారు. డి ఎడిక్షన్ సెంటర్ ను తరచూ తనిఖీ చేయవలసినదిగా పోలీసు శాఖ వారికి తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ తో కలిసి సంయుక్తంగా " డ్రగ్స్ వద్దు - స్కిల్స్ ముద్దు " అనే పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ, డి ఆర్ ఒ, పి. గ్లోరియా, నర్సాపురం డి.ఎస్.పి మేకా సుధాకర్, భీమవరం డిఎస్ పి, జిల్లా విద్యాశాఖ అధికారి ఒ వి ఎస్ అనీల్ కుమార్, ఈగల్ సీఐ, భీమవరం వన్ టౌన్ సిఐ, భీమవరం సిసిఎస్ తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 09 నుండి అక్టోబర్ 08 వరకు 9వ జాతీయ పోషణ మాసం - 2026' కార్యక్రమాలు.







## ఆరోగ్యమైన బిడ్డలే రేపటి దేశ రక్షణ, ప్రగతికి పునాదులు.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, బ్యూరో చీఫ్ 9 సెప్టెంబర్, నంది పత్రిక** సమాజంలో పోషకాహార లోపాన్ని నిర్మూలించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. బుధవారం పిజిఆర్ ఎస్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "9వ జాతీయ పోషణ మాసం – సెప్టెంబర్ 2026" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషిత బాల్యం ఉన్నప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించడమే మన అందరి ప్రాథమిక లక్ష్యం అని అన్నారు. 9వ జాతీయ పోషణ మాస ఉత్సవాలు గ్రామ, వార్డు, మున్సిపాలిటీలలో పండుగ వాతావరణం లో నిర్వహించాలని అన్నారు. ప్రతి అంగనవాడి కేంద్రంలో నవచేతన కార్యక్రమం కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా తమ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను తరచూ తనిఖీలు నిర్వహించాలని తెలియజేశారు. వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవో, ఎమ్మార్వో లను భాగస్వాములను చేయాలని అన్నారు. వీటితోపాటు అంగన్వాడి కమిటీలను కూడా భాగస్వాములను చేయాలని తెలియజేశారు. చిన్నారులకు ఆహారం ఇచ్చే క్రమంలో తల్లులు పౌష్టికాహారాన్ని క్రమ పద్ధతిలో అందించాలని తెలిపారు. చిన్నారులను జంక్ ఫుడ్ కు దూరంగా ఉంచాలని వీటి వియోగం వలన వారి ఎదుగుదలకు నిరోధకంగా మారుతుందని అన్నారు. ప్రతి అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు రుచికరమైన, ప్రత్యేకంగా వంటకాలను తయారుచేసి అందించాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల నిర్వహణ పట్ల ప్రజల్లో సానుకూల స్పందన కలిగే విధంగా విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. నరసాపురం నియోజకవర్గం వంటి ప్రాంతాలలో అంగన్వాడి కేంద్రాల పనితీరు, అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన, మాతృ సంరక్షణ పథకాలను అర్హులందరికీ సమర్థవంతంగా అందేలా చూడాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పౌష్టికాహారంతో చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ మాసం – 2026' కార్యక్రమాలను సెప్టెంబర్ 09 నుండి అక్టోబర్ 08 వరకు నెల రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 'మన అంగన్‌వాడీ – మన బాధ్యత' అనే నినాదంతో ఈ పోషణ్ మాసం సాగుతుందని, ప్రతీ ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని తెలిపారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలలో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని అన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో శుభ్రమైన, పౌష్టికాహారంతో కూడిన వేడి వంటకాలను పిల్లలకు అందించాలని అన్నారు. "ఆడుకుందాం – నేర్చుకుందాం – ఎదుగుదాం" అనే దృక్పథంతో చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి వారికి వైద్య సహాయం, అదనపు పోషకాహారం అందించాలని సూచించారు. "మన అంగన్‌వాడీ – మన గ్రామ గర్వం" అనే భావనతో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులై సుస్థిరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని అన్నారు. ఆరోగ్యమైన బిడ్డలు, పోషిత బాల్యం ద్వారా ప్రగతిశీలను సాధించడమే మన ప్రాథమిక లక్ష్యం అన్నారు. బాల్య దశలోనే చిన్నారులకు సరైన పోషణ అందిస్తేనే రేపటి దేశ భవిష్యత్తు ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. ఐసిడిఎస్ పీడీ, సిడిపిఓలు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేయాలని అన్నారు. ఐసిడిఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పని చేసి ఈ పోషణ మాసాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. శ్రీలక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 1626 అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, హాజరు నమోదు, గర్భిణులు–బాలింతల నమోదు వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ప్రీ స్కూల్స్ సంబంధించి హాజరు, ఎన్రోల్మెంట్ పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌలిక సౌకర్యాలు నిర్వహణ సజావుగా ఉండాలని అన్నారు. చిన్నారులు లంచ్ బాక్స్ లను ప్లాస్టిక్ డబ్బాలలో వినియోగించకుండా తల్లులు జాగ్రత్త వహించాలని తెలిపారు. అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్వాడి కేంద్రాలు కంబైన్డ్ టాయిలెట్స్ ఉన్న వాటిని తీసుకోవద్దని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో కిచెన్, ప్రీ స్కూల్స్ విడివిడిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. చిన్నారులకు న్యూట్రిషన్ ఆహారాన్ని మాత్రమే అందేలా తల్లులే తమ ఇంటి వద్ద స్వయంగా చేసిన ఆహారాన్ని మాత్రమే అందించాలని అన్నారు. అప్పుడే చిన్నారులు ఆరోగ్యవంతంగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం 9వ జాతీయ పోషణ మాసం – సెప్టెంబర్ 2026 పోస్టర్ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఐ సి డి ఎస్ పి డి శ్రీలక్ష్మి, సిడిపివోలు ఆవిష్కరించారు. చిన్నారులకు పోషకాహారం అందించే ప్రతిజ్ఞను చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లో 1, శిశు గృహంలో 2, తణుకులోని వన్ స్టాప్ సెంటర్ లో 3 పోస్టులను భర్తీ చేస్తూ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా సిడిపిఓలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, జిల్లా నోడల్ అధికారి పి. విజయలక్ష్మి, ఇఓ సి హెచ్ సుజాత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలోని ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించాలి.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణను మెరుగుపరచడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష సమావేశం లో రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, వైద్యశాఖ, మునిసిపల్, ఎన్.హెచ్, విద్యా శాఖ, ఆర్ టి సి, ఆర్ డి ఓ లు అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన భద్రత చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వివరాలు, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలు, ప్రమాద ప్రాంతాల గుర్తింపు, ట్రాఫిక్ నియమాల అమలు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులు పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ప్రమాదాలు సంబంధించిన వెంటనే ప్రమాదం చేసిన డ్రైవర్లతోపాటు, రహదారి పైన పశువులు యజమాని పై కూడా కేసులు నమోదు చేయాలని అన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. మైనర్ లు డ్రైవింగ్‌ను అరికట్టాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ట్రాఫిక్ నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాల ఏర్పాటు వంటి చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా వినూత్నమైన ఆలోచనలతో అధికారులు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాల గణాంకాలను నెలవారి సమీక్షించి, ప్రమాదాలకు గల కారణాలపై విస్తృతంగా చర్చించారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా అధిక వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు. కళాశాల విద్యార్థులకు రోడ్డు భద్రత నియమ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం, సెల్ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవ్ చేయడం, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, రోడ్ల మలుపు ప్రాంతాలలో ఎక్కువగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో పార్కింగ్ ప్రదేశాలు నిర్దేశించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారురు. పట్టణాలలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని అన్నారు. జిల్లాలో ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు వినూత్నమైన ఆలోచనలతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పీఎం రాహత్ పథకం రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర సమయంలో నగదు లేకపోయినా క్యాష్‌లెస్‌గా చికిత్స అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. ఈ పథకం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ప్రమాద బాధితుడికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు క్యాష్‌లెస్ వైద్యం చేయించుకోవచ్చని అన్నారు. మోటారు వాహనం కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. పథకంలో గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోవచ్చని అన్నారు. ఆసుపత్రి అర్హత ఉన్న బాధితుడికి చికిత్స నిరాకరిస్తే అది పథకం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ప్రమాదం సంభవించి గోల్డెన్ అవర్ లో బాధితులను దగ్గరలోని ఆసుపత్రికి తరలించిన వారికి 25 వేల రూపాయలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. మైనర్ లు ఎవరు కూడా వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోవద్దని తెలిపారు. ఆక్సిడెంట్ కేసులను ఎప్పటికప్పుడు యాప్ లో అప్డేట్ చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కల్ప శ్రీ, భీమవరం ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తాడేపల్లిగూడెం ఆర్డిఓ సూర్యారావు, డి టి ఓ కె ఎస్ ఎం ఎన్ కృష్ణారావు, నర్సాపురం డి.ఎస్.పి మేక సుధాకర్, డిఇఓ ఓవిఎస్ అనిల్ కుమార్, భీమవరం మున్సిపల్ కమిషనర్, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ వీరబ్రహ్మం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి హెచ్ వి భరత్ లక్ష్మి, ఎన్ హెచ్ 216 పిడి సాయి శ్రీనివాస్, ఈఈ పంచాయతీరాజ్ ఇ. భాస్కర్, 108 సర్వీసెస్ అధికారి కే. రాజు, పోలీసు శాఖ, రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు..

## కళాశాలలో 2.32 కోట్లతో నిర్మించిన నూతన లైబ్రరీ భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు



**విజయవాడ, బ్యూరో చీఫ్ సెప్టెంబ్ 9 నంది పత్రిక** విజయవాడ మాచవరం ఎస్ ఆర్ ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో సుమారు రూ.2.32 కోట్లతో నిర్మించిన నూతన లైబ్రరీ భవనాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఎనఐఆరఎఫ్ పైలట్ ప్రాజెక్టు కింద నిర్మించిన నూతన లైబ్రరీ భవనం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో ఇది కీలకంగా నిలుస్తుందని, భవన నిర్మాణంలో ఫ్లోరింగ్, టైల్స్, ఫినిషింగ్, పెయింటింగ్, ఫ్యాన్లు తదితర పనుల్లో నాణ్యతకు ఎక్కడా రాజీ పడలేదని, అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మాణాన్ని పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను అభినందించారు. కార్పొరేట్ కళాశాలలు, ప్రైవేట్ యూనివర్సిటీలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఎస్.ఆర్.ఆర్. కళాశాలకు ఘనమైన చరిత్ర ఉందని, నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వంటి మహనీయులు ఇక్కడ విద్యనభ్యసించారని గుర్తు చేశారు, ఈ చారిత్రక కళాశాలను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, కళాశాల ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, వల్లభనేని సతీష్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ చేసిన అవాస్తవాలపై 'నిజం గెలిచింది'

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై స్కిల్ సెంటర్ల కుంభకోణం పేరుతో అవాస్తవామైన అంశాలపై కేసు నమోదు చేసి 53 రోజులు అన్యాయంగా ఆయన్ను జైలులో పెట్టారని, చివరకు నిజం గెలిచిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం వద్దనున్న జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఉదయం విలేఖరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గద్దె దంపతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి విజన్‌తో పనిచేస్తున్న నారా చంద్రబాబునాయుడిని జైలు పెట్టాలనే ఆలోచనతో మూడు సంవత్సరాల క్రితం ఇదే రోజున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయించిందని తెలిపారు. చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. నారా చంద్రబాబునాయుడిని అరెస్ట్ చేసిన ఆ రోజును టీడీపీ 'బ్లాక్ డే'గా పాటిస్తోందన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తూర్పు నియోజకవర్గంలోని లయోలా, ప్రభుత్వ పాలిటెక్నిక్, సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లను తాను స్వయంగా పరిశీలించానని, అక్కడ ఉన్న సెంటర్లల్లో ట్రైనింగ్ పొందిన వారి జాబితాను సెంటర్ల నిర్వాహకులు తనకు అందచేశారన్నారు. ఆ స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లల్లో శిక్షణ పొందిన వారు స్వచ్ఛందంగా బయటకు వచ్చి తాము లక్షల రూపాయల్లో జీతాలు తీసుకున్నామంటే, అందుకు కారణం ఆ స్కిల్ సెంటర్లేనని చెప్పారని వివరించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 16 నెలల పాటు జైలులో ఉన్నాడని, 46 వేల కోట్ల రూపాయాలను సీజ్ చేశారని, ఈడీ కేసులు కూడా జగన్‌పై నమోదు అయ్యాయని గుర్తుచేశారు. సెప్టెంబరు 9న ప్రతి కార్యకర్త వారి ఇంటి ఆవరణలో 53 దీపాలు వెలిగించాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. 53 రోజుల పాటు జైలులో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజమండ్రి నుంచి విజయవాడ రావడానికి 12 గంటల సమయం పట్టిందని, అది ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానం, ఆదరణ అని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాకుండా ప్రజల తీర్పు ఇచ్చారంటే, జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనమని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా పంటలకు నీరు అందిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్‌తోనే ఆనాడు హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఉన్నత రాష్ట్రంగా చేసేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ మాట్లాడుతూలి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేసిన రోజును తెలుగుదేశం పార్టీ చీకటి రోజుగా పాటిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అన్యాయంగా, కక్షపూరితంగా లేనిపోని అరోపణలు చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని అరెస్ట్ చేసి, 53 రోజులపాటు జైలులో ఉంచారన్నారు. 73 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జైలులో ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. అయినా చివరకు 'నిజం గెలిచింద'న్నారు. చీకటి రోజున వెలుగులు నింపేందుకు 53 కొవ్వొత్తులను వెలిగించామన్నారు.



## పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సస్తుంది

### ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు



**విజయవాడ బ్యూరో చీఫ్, సెప్టెంబ్ 9 నంది పత్రిక** సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుల కార్యాలయం వద్ద 58వ డివిజన్ ఆంధ్రప్రభ కాలనీకి చెందిన శ్రీలేఖ మోంట్రా కంపెనీ ఎలక్ట్రిక్ ఆటోను జీవనోపాధి నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డౌన్ పేమెంట్‌గా రూ.25,000లను బొండా ఉమామహేశ్వరరావు స్వయంగా చెల్లించడంతో పాటు, రూ.5,000 నగదును కూడా ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో కాలుష్యం తగ్గడంతో పాటు ఆటో డ్రైవర్లకు ఇంధన ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. ఒక్కసారి ఛార్జింగ్‌తో సుమారు 180 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని, పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే నిర్వహణ ఖర్చులు కూడా తక్కువగా ఉంటాయని తెలిపారు. ఎలక్ట్రిక్ ఆటోలను వినియోగించాలనుకునే వారు ఇంట్లో ఛార్జింగ్ చేస్తే విద్యుత్ బిల్లు పెరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోతామనే అపోహలకు గురికావద్దని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత సులభతరం చేసేందుకు పబ్లిక్ ప్రదేశాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. సింగ్‌నగర్‌తో పాటు నియోజకవర్గంలోని అవసరమైన ప్రాంతాల్లో పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తానని, ఎలక్ట్రిక్ వాహనదారులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ప్రభుత్వం, సంబంధిత కంపెనీల సహకారంతో పరిష్కరించేందుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, మోంట్రా ఎలక్ట్రిక్ ఆటో కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# త్వరితగతిన పనులు పూర్తి చేయాలి - ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

## క్వాలిటీలో రాజీ లేకుండా నాణ్యత పెంచాలి - మంత్రి కొలుసు పార్ధసారథి

## పట్టణంలో జరుగుతున్న పనులను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

**నూజివీడు బ్యూరో చీఫ్ సెప్టెంబరు:9 నంది పత్రిక** నూజివీడు పట్టణంలో గత 15 ఏళ్లుగా జరగని అభివృద్ధిని నేడు శరవేగంగా చేస్తూ ప్రజల కళ్ళల్లో ఆనందాన్ని నింపుతున్న రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పట్టణంలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులోజరుగుతున్న డ్రైనేజీ, సిసి రోడ్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఒక ప్రణాళికాబద్ధంగా పనిచేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలు చేరాలంటే అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు.ఇ "పనుల నాణ్యతతో రాజీ పడకుండా పనిచేయాలి. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. పట్టణంలో జరిగే పనులన్నీ నాణ్యతలో పారదర్శకంగా ఉండాలి." ఇప్పటికే నగరంలో సెంట్రల్ లైటింగ్, డివైడర్, రోడ్ల వెడల్పు, డ్రైనేజీ పూడికతీత, ఇండోర్ స్టేడియం ఇలా పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.సుమారు రూ.42 లక్షలతో పి జి కళాశాల నుండి ద్వారకా సినీ థియేటర్, సింగ్ హోటల్ వరకులి డ్రైనేజీ, బీటీ రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.రానున్న కొన్ని నెలల్లో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ సిసి రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు



అంకితం చేసి నూజివీడు నగరానికి ఒక కొత్త రూపు తెచ్చి స్మార్ట్ సిటీగాతీర్చిదిద్దడంలో అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మంత్రివెంట మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత

## నీటి సంరక్షణ, స్వచ్ఛత, హరిత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టండిలి

## రైతులకు ఎరువుల కొరత లేకుండా పటిష్ట పర్యవేక్షణ

## ప్రజా భద్రతపై రాజీ లేదు.. విస్తృతంగా భద్రతా తనిఖీలు నిర్వహించాలిలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టమైన ఆదేశాలు



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** ముఖ్యమంత్రి కార్యాలయం, పీజీఆర్ఎస్.. ఇలా వివిధ మార్గాల ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన విచారణ చేపట్టి తప్పనిసరిగా నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరం నుంచి కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.. జిల్లా స్థాయి అధికారులతో నేరుగా, డివిజన్, మండల స్థాయి అధికారులతో వర్చువల్ గా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలధారజలహారతి 2.0 కింద పనులకు అవసరమైన అనుమతులను వేగంగా పొందడంతో పాటు పనులను పటిష్టంగా పర్యవేక్షించాలని సూచించారు. నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పరిస్థితిని పర్యవేక్షించాలని, వాన నీటి సంరక్షణ, రీఛార్జ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది స్వయంగా పాల్గొని పరిశుభ్రత, ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నెట్ జీరోలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో సోలార్ ప్యానెళ్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లాంటేషన్ పనులను వేగవంతం చేసి, వేప, టేకు వంటి నాణ్యమైన మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో సెకండ్ డోస్ ప్రారంభమైనందున ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల్లోని స్టాక్‌ను ప్రతి వారం తనిఖీ చేయాలని, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఎరువుల దుకాణాల వద్ద ధరలు, ఫిర్యాదుల కోసం కలెక్టర్ కార్యాలయ కాల్ సెంటర్ వివరాలతో ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పెట్రోల్ బంకులు, బహుళ అంతస్తుల భవనాలు, థియేటర్లు, కెమికల్ పరిశ్రమలు, షాపింగ్ ఏరియాలు తదితరాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. 'వన్ ఫ్యామిలీవన్ ఆంత్రప్రెన్యూర్' సర్వే డేటాను మండలాలు, పట్టణ ప్రాంతాల్లో వేగంగా అప్‌డేట్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. కాలుష్య నియంత్రణ మండలి, ఇతర సమన్వయ శాఖల అధికారులతో కలిసి మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్లను ఆవిష్కరించారు.. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు అరెస్ట్ రోజు ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే

## అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టినా ప్రజలు తిరుగులేని తీర్పు ఇచ్చారు: గద్దె అనురాధ



**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** రాష్ట్రానికి దశాబ్దాలుగా సేవలందించిన మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్ట్ చేసిన రోజును ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డేగా పరిగణిస్తున్నామని టీడీపీ నాయకులు గద్దె రామమోహన్, గద్దె అనురాధ దంపతులు అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా వారి నివాసం వద్ద 53 కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల క్రితం రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన చంద్రబాబును రాజకీయ కక్షతో అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఈ ఘటనను రాష్ట్ర ప్రజలే కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు తీవ్రంగా వ్యతిరేకించారని అన్నారు. ఎందరో యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి అవకాశాలు కల్పించిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో అవినీతి జరిగిందంటూ చంద్రబాబును జైలులో పెట్టి అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఈ పరిణామాలతో ఆగ్రహించిన ప్రజలు ఎన్నికల్లో టీడీపీ కూటమికి తిరుగులేని మెజార్టీ అందించారని తెలిపారు. దేశంలోని అనేక ప్రాంతాలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో చంద్రబాబు ముందుచూపుతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి ప్రజలకు నీటిని అందించారని గద్దె అనురాధ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అబద్ధాలు, తప్పుడు ఆరోపణలు చేయడం జగన్ నైజంగా మారిందని విమర్శించిన ఆమె.. అదే ధోరణిలో టీడీపీ నేతలపై కూడా తప్పుడు ఆరోపణలు, కేసులు పెట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. శ్రీకృష్ణుడు కంసుడి కుట్రలను ఛేదించి ధర్మాన్ని నిలబెట్టినట్లే.. చంద్రబాబుపై జరిగిన కుట్రలను ప్రజలు అర్థం చేసుకుని ఆయనకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

**కుట్రలు చేసినా చంద్రబాబును ఏమీ చేయలేరు: గద్దె రామమోహన్**గద్దె రామమోహన్ మాట్లాడుతూ.. "నిత్యం అబద్ధాలు చెప్పడం జగన్ నైజంగా మారింది. బాబాయ్ హత్య నుంచి చంద్రబాబు అరెస్ట్ వరకు ఎన్నో వివాదాస్పద అంశాలు ఆయన పాలనలో చోటుచేసుకున్నాయి" అని విమర్శించారు. కల్తీ మద్యం ఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయినా బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాల్లో జరిగిన పరిణామాల అనంతరం చంద్రబాబు మరింత బలంగా ప్రజల ముందుకు వచ్చారని అన్నారు. ప్రజల తీర్పుతో ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొత్త దిశలో కొనసాగుతోందని, రాష్ట్రాన్ని గుంతలు లేని రహదారులతో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని గద్దె రామమోహన్ తెలిపారు. చంద్రబాబు అరెస్ట్ జరిగిన రోజును బ్లాక్ డేగా ప్రకటిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గద్దె రామమోహన్, గద్దె అనురాధ పిలుపునిచ్చారు.

# నిజం గెలిచింది రాష్ట్రవ్యాప్త స్మారక కార్యక్రమానికి

## రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9 నంది పత్రిక** నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు మరియు 53 రోజుల అనంతరం 2023 అక్టోబర్ 31న రాజమ హేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి ఆయన విడుదలైన ఘటనలకు మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా "నిజం గెలిచింది పేరుతో స్మారక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. 2023 సెప్టెంబర్ 9న అప్పటి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అరెస్టు రాజకీయ కక్ష సాధింపు చర్యగా ప్రజలకు తెలియజేయడం, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలకు గుర్తు చేయడం, ప్రజాస్వామ్యంలో న్యాయం, సత్యం చివరకు విజయం సాధిస్తాయనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారునిజం గెలిచింది ప్రధాన సందేశంఈ రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమాల్లో నిజం గెలిచింది అనే నినాదాన్నే ప్రధాన బ్రాండింగ్‌గా ఉపయోగించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సూచించారు.2023 సెప్టెంబర్ 9న జరిగిన అరెస్టు దర్యాప్తు కోసం జరిగిన సాధారణ చర్య కాదని, రాజకీయంగా కక్ష సాధించాలనే ఉద్దేశంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. 53 రోజులు ఒక వ్యక్తి అనుభవించిన కష్టానికి మాత్రమే పరిమితం కాదని, రాష్ట్రం అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో అనుభవజ్ఞుడైన నాయకుడిని ప్రజలకు దూరం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా ఆ ప్రభావాన్ని అనుభవించారని తెలిపారు.

**కేసు కొట్టివేత సత్యానికి విజయం** ఈ కేసులో న్యాయస్థానాల తీర్పులు, తదనంతర పరిణామాలు సత్యం వైపు ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచాయని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు.జైలులో గడిచిన 53 రోజులు వాస్తవం. కానీ ఆయనపై మోపిన ఆరోపణలకు ఆధారం లేదనే విషయం న్యాయపరమైన పరిణామాలతో స్పష్టమైంది. అందుకే ఇది 'నిజం గెలిచింది' అనే సందేశానికి ప్రతీక" అని ఆమె అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాల ద్వారా ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ శ్రేణులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**కార్యక్రమాల నిర్వహణపై మార్గదర్శకాలు** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే అన్ని కార్యక్రమాలకు "నిజం గెలిచింది" అనే ప్రధాన బ్రాండింగ్‌ను ఉపయోగించాలి.కార్యక్రమాల ప్రచార సామగ్రిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫొటోలను ఉపయోగించకూడదు.ప్రజలకు సత్యం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలి.పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.

**నాయకులు, కార్యకర్తల పాల్గొనడం**ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు, రాష్ట్ర ఏపీఐఐసీ డైరెక్టర్ గొల్లిపూడి పెద్దిరాజు, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్, మాజీ టీడీపీ అధ్యక్షుడు జి. తాతారావు, సురిసెట్టి సురేష్, శేషుబాబు, షేక్ బాబి, వాడపల్లి చిట్టిబాబు, బుజ్జి, గంగరాజు, తేజ, రాంబు, చెక్క లోవరాజు, పాలక సత్తిబాబు, ఉట్ల చిన్న, మాజీ ఎంపీ టీసీ మినవల్లి సుబ్బారావు, కొంగర సావిత్రి, పసగడుగుల రాజు, కొప్పిశెట్టి వీరబాబు, పోసిన బాబురావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ, నిజాన్ని ఎంతకాలం అణచివేసినా చివరకు నిజమే గెలుస్తుంది. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు స్థానం ఉండకూడదు. న్యాయం, సత్యం పట్ల ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడమేనిజం గెలిచింది కార్యక్రమం లక్ష్యం" అని అన్నారు.

# సింహాద్రినాథుడిని దర్శించుకున్న గంట్ల

## స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

**విశాఖపట్నం బ్యూరో చీఫ్ ఆగస్టు 9: నందిపత్రిక** సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారిని బుధవారం జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఎన్ఏజే ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.అనంతరం సింహాద్రినాథుడిని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి శ్రీ మహాలక్ష్మి గోదాదేవి అమ్మవార్లను కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామివారి సన్నిధిలో కొంతసేపు ఆధ్యాత్మికంగా గడిపి, ఆలయ ప్రాంగణంలోని పలు సన్నిధులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబుకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు తెలిపారు. సింహాచలం క్షేత్రం భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.





# మైలవరంలో లక్ష్మీ నరసింహ కళ్యాణ మండపం ప్రారంభం.



**విజయవాడ బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 9 నంది పత్రిక** ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో శ్రీ లక్ష్మీ నరసింహ కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, సుమారు 700 సంవత్సరాల చరిత్ర కలిగిన మైలవరం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవడం సుకృతమన్నారు. స్వామివారి ఆశీస్సులు కూటమి ప్రభుత్వంపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. దేవాదాయ శాఖను నిర్వహించే బాధ్యతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు తనకు అప్పగించడం అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు. సుదీర్ఘ రాజకీయ, పరిపాలనా అనుభవం కలిగిన చంద్రబాబు వంటి నాయకుడి వద్ద పనిచేయడం మహద్భాగ్యమన్నారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి తనకు ఈ బాధ్యత అప్పగించారని చెప్పారు.రాష్ట్రంలో ఆధ్యాత్మికతను మరింత పెంపొందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కామన్ వెల్త్ ఫండ్ కీలకమైనదని తెలిపారు. దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయాల పునర్నిర్మాణానికి వినియోగిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా పుణ్యక్షేత్రాల్లో సుమారు 700 ఆలయాల పునర్నిర్మాణానికి కోట్లాది రూపాయల నిధులు కేటాయించి టెండర్లు పిలిచామని వెల్లడించారు. దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం గతంలో ఇస్తున్న రూ.2 వేల మొత్తాన్ని చంద్రబాబు ప్రభుత్వం రూ.10 వేలకు పెంచిందన్నారు. ఏజెన్సీ, గిరిజన, అటవీ ప్రాంతాల్లో కూడా ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**'నిజం గెలిచింది' కార్యక్రమం** 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మూడు సంవత్సరాల క్రితం నంద్యాల పర్యటనలో చంద్రబాబుని దౌర్జన్యంగా నిర్బంధించి అరెస్టు చేశారని, అనంతరం 53 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచారని ఆరోపించారు. చంద్రబాబే శంకుస్థాపన చేసిన రాజమండ్రి సెంట్రల్ జైలులో ఆయనను ఉంచి అప్పటి ప్రభుత్వం పైశాచిక ఆనందాన్ని పొందిందని విమర్శించారు.బ్రిటీష్ వారు కూడా ఇంత నీచంగా, క్రూరంగా ప్రవర్తించలేదని మంత్రి వ్యాఖ్యానించారు. ఆ క్రూరత్వాన్ని ఎదురించి నిజాయితీగా నిలబడి, ప్రజల మద్దతుతో చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారని తెలిపారు. చంద్రబాబు నిర్దోషి అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న చంద్రబాబుకు సంఘీభావంగా 'నిజం గెలిచింది' కార్యక్రమంలో భాగంగా 53 దీపాలను ప్రతి ఇల్లు, కార్యాలయంలో వెలిగించి కూటమి నేతలు నిలబడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు పునర్నిర్మాణానికి ప్రజలు సహకరించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరారు.

# సెప్టెంబర్ 9...నిజం గెలిచిన రోజు.

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 9: నంది పత్రిక** మూడు సంవత్సరాల క్రితం సెప్టెంబర్ 9న అప్పటి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ని అరెస్టు చేసిన ఘటన ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. అదే సమయంలో ఆ ఘటన ప్రజాస్వామ్య పరిరక్షణకు, నిజం గెలిచే దిశగా జరిగిన పరిణామాలకు నాంది పలికిన రోజుగా కూడా చరిత్రలో నిలిచిందన్నారు.బుధవారం మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ, ప్రజల కోసం పర్యటిస్తున్న చంద్రబాబు నాయుడిని అర్ధరాత్రి సమయంలో అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంచారని ఆరోపించారు. రాజకీయ కక్షతోనే ఆయనపై కేసులు పెట్టి, అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.చంద్రబాబు నాయుడిపై కేసు నమోదు చేసిన సమయంలో వందల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేసినప్పటికీ, అనంతరం దర్యాప్తు, న్యాయ ప్రక్రియలో ఆ ఆరోపణలకు సంబంధించి అనేక అంశాలు మారిపోయాయని వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు. యువతకు, ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాలను నేరాలుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని అన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలు పెద్ద ఎత్తున స్పందించి ఆయనకు అండగా నిలిచారని తెలిపారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు కూడా నైతిక మద్దతు ప్రకటించి నిరసనలు, దీక్షలు చేపట్టారని గుర్తుచేశారు. చంద్రబాబు గారిని 53 రోజుల పాటు జైలులో ఉన్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, టీడీపీ శ్రేణులు ఉద్యమించాయని, అక్టోబర్ 31న ఆయన విడుదలయ్యే వరకు ఆ ఉద్యమం కొనసాగిందన్నారు.

**మైలవరం నియోజకవర్గంలోనూ అండగా నిలిచాం.** చంద్రబాబు గారి అరెస్టుకు నిరసనగా మైలవరం నియోజకవర్గంలోనూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు నిర్వహించాయని ఎమ్మెల్యే తెలిపారు. అప్పట్లో తాను ప్రతిపక్ష శాసనసభ్యుడిగా ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా వ్యవహరించానన్నారు.చంద్రబాబు అరెస్టును సమర్థిస్తూ అప్పటి అధికార పార్టీ శాసనసభ్యులతో ప్రెస్‌మీట్లు నిర్వహించాలని పార్టీ నుంచి సూచనలు, పాంప్లెట్లు వచ్చినప్పటికీ తాను ఎక్కడా ఒక్క ప్రెస్‌మీట్ కూడా పెట్టలేదని వసంత కృష్ణప్రసాదు స్పష్టం చేశారు. మైలవరం నియోజకవర్గంలో చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా జరిగిన ధర్నాలు, నిరసనలను అడ్డుకునే ప్రయత్నం కూడా తాను చేయలేదన్నారు.గొల్లపూడిలో టీడీపీ నాయకులు, మహిళలు నిర్వహించిన కాగడాల ప్రదర్శన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఆయన ప్రస్తావించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.

**పవన్ కల్యాణ్ మద్దతు కీలకం** చంద్రబాబు అరెస్టు సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆయనకు అండగా నిలిచారని వసంత కృష్ణప్రసాదు తెలిపారు. చంద్రబాబుకు మద్దతు తెలిపేందుకు పవన్ కల్యాణ్ విమానాశ్రయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో అడ్డంకులు ఎదురైనా, చివరకు ఆయన చేరుకుని చంద్రబాబు గారికి మద్దతు ప్రకటించారని చెప్పారు. ఆ సమయంలో ఏర్పడిన రాజకీయ పరిణామాలు భవిష్యత్తులో కూటమి ఏర్పాటుకు బీజం వేశాయని పేర్కొన్నారు.చంద్రబాబు అరెస్టు అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో పెరిగిన ఆగ్రహం, ఉద్యమం అప్పటి ప్రభుత్వ పతనానికి నాంది పలికిందని వసంత కృష్ణప్రసాదు వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న వారు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలనే విషయానికి ఈ ఘటన సజీవ ఉదాహరణగా నిలిచిందన్నారు.

**నిజమే గెలిచింది.. న్యాయమే గెలిచింది** చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో న్యాయపోరాటం సుదీర్ఘమైన ప్రక్రియ అని, కోర్టుల తీర్పులపై తాము వ్యాఖ్యానించదలుచుకోలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అయితే కాలపరీక్షలో చివరకు నిజమే గెలిచిందని, న్యాయమే గెలిచిందని అన్నారు.ఈ ఏడాది జనవరిలో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో చంద్రబాబు నాయుడికి ఈ కేసులో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని పేర్కొన్నట్లు వసంత కృష్ణప్రసాదు తెలిపారు. దీనివల్ల చంద్రబాబు గారి అరెస్టు సందర్భంగా చేసిన ఆరోపణలపై మరింత స్పష్టత వచ్చిందన్నారు.

**53 కొవ్వొత్తులతో సంఘీభావం** చంద్రబాబు నాయుడి గారిని 53 రోజుల పాటు జైలులో ఉంచినందుకు గుర్తుగా సెప్టెంబర్ 9న సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యాలయాలు, ఇళ్ల వద్ద 53 కొవ్వొత్తులు వెలిగించి ఆయనకు సంఘీభావం తెలపాలని ప్రజలకు, టీడీపీ శ్రేణులకు వసంత కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. వ్యక్తిగత దాడులు, వ్యక్తిగత ద్వేషాలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో ప్రజలు ఆయన వెనుక నిలబడటం ద్వారా ప్రజాస్వామ్య శక్తిని చాటారని పేర్కొన్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com